# పెన్ పవర్

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 06 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా సోమవారం 17 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 06 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, MON 17 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే
# అది రాజ్యాంగం వల్లే

- రాజ్యాంగంపై సదస్సులో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు
- భారత్‌ను ప్రపంచంలో నంబర్ 1 చేయాలని మోదీ కృషి చేస్తున్నారు
- సీజేఐ జస్టిస్ గవాయ్ గొప్ప వ్యక్తి అని కొనియాడిన సీఎం
- సమాన ఓటు హక్కు అంబేడ్కర్ ఇచ్చిన వరం అని వెల్లడి
- 2047 నాటికి భారతీయులు ఉన్నత స్థాయికి చేరతారని ధీమా



పెన్ పవర్ డెస్క్:ఒకప్పుడు చాయ్‌వాలాగా జీవితం ప్రారంభించిన నరేంద్ర మోదీ ఈరోజు దేశానికి ప్రధానమంత్రి కాగలిగారంటే అందుకు కారణం భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం – 75 సంవత్సరాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తాను ముఖ్యమంత్రిగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా, జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏపీ హైకోర్టు సీజేగా తమ విధులను నిర్వర్తిస్తున్నామంటే అదంతా రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమేనని పేర్కొన్నారు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పై చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతం నుంచి వచ్చారని గుర్తుచేశారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, ఎల్లప్పుడూ సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. "జస్టిస్ గవాయ్ చాలా మంచి మనసున్న వ్యక్తి. ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే గొప్ప తీర్పులను ఆయన వెలువరించారు" అని చంద్రబాబు అన్నారు. భారతదేశ భవిష్యత్తుపై చంద్రబాబు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోని అనేక దేశాలు యువత కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. కానీ, మన దేశంలో ఆ సమస్య లేదు. అపారమైన మానవ వనరులు మన సొంతం. సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానం లో మార్పు వచ్చింది. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అత్యంత ప్రభావశీల శక్తిగా ఎదుగుతారన్న నమ్మకం నాకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమాజంలో తప్పులు జరిగినప్పుడు వాటిని సరిదిద్ది, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## ఏపీ అభివృద్ధి అంతా డొల్ల... చంద్రబాబు విజన్ ఇదేనా?

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై వైసీపీ అధినేత జగన్ విమర్శ
- పెరుగుతున్న అప్పులు, పడిపోతున్న మూలధన వ్యయంపై ఆందోళన
- రెండంకెల అభివృద్ధి అబద్ధం, పన్నుల వసూళ్లు నిరాశాజనకం అన్న జగన్
- జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కేవలం 2.85 శాతం పెరిగాయని వెల్లడి
- కొద్ది కాలంలోనే రూ.2.06 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్... సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ పూర్తిగా విఫలమైందని, ఆదాయం పడిపోతూ అప్పులు భారీగా పెరుగుతున్నాయని ఆరోపించారు. కాగ్ (CAG) విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ ఆయన ట్వీట్ చేశారు. "2025-26 ఆర్థిక సంవత్సరం

వివరాలు 2లో..



## పవన్ కళ్యాణ్ వల్ల ఇతర మతాల్లోకి వెళ్లిన హిందువుల్లో ఆలోచన మొదలైంది

- హిందువులు ఓటు బ్యాంకుగా మారాలని బండి సంజయ్ పిలుపు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంపై కీలక వ్యాఖ్యలు
- మతం మారిన వారు తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ఓటు బ్యాంకుగా మారాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తర్వాత హిందువుల్లో కసి పెరిగిందని, ఇకనైనా మేల్కొని ఐక్యత

వివరాలు 2లో..



## బీహార్ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరేదెప్పుడంటే..!

- పాట్నాలోని గాంధీ మైదానంలో సీఎం ప్రమాణ స్వీకారం
- మరోమారు ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్..!
- సీఎం ఎవరనేదానిపై అధికారికంగా ఇప్పటికీ వెలువడని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలి సిందే. ఈ నెల 14న ఫలితాలు వెలువ డగా, ప్రస్తుతం

వివరాలు 2లో..

## స్టీల్ ప్లాంట్ పై సీఎం చంద్రబాబు
# మాటలను వక్రీకరిస్తున్నారు

- విశాఖ ఉక్కుపై అపోహలు సృష్టించొద్దన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- స్టీల్ ప్లాంట్‌ను ఆదుకున్నది ఎన్డీయే ప్రభుత్వమేనని ఉద్ఘాటన
- ఉక్కు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ ప్రజలను, కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, దానిని లాభాల బాట పట్టించేందుకే చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, "నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

## నా సోదరిని అవమానిస్తే ఊరుకోను:
# తేజ్ ప్రతాప్ యాదవ్ వార్నింగ్



- లాలూ కుటుంబంలో బయటపడ్డ విభేదాలు
- రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు రోహిణి ఆచార్య ప్రకటన
- చెల్లి అవమానాన్ని సహించలేనన్న అన్న తేజ్ ప్రతాప్
- కుటుంబాన్ని టార్గెట్ చేస్తే పాతి పెడతానంటూ హెచ్చరిక
- సంకేతం ఇవ్వాలంటూ తండ్రి లాలూకు భావోద్వేగ పిలుపు
- ఆర్జేడీ ఓటమి తర్వాత మొదలైన అంతర్గత కలహాలు

పెన్ పవర్ డెస్క్:బీహార్ రాజకీయాల్లో కీలకమైన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి

వివరాలు 2లో..


## తిరుమల శ్రీవారి సేవల
# ఫిబ్రవరి కోటా...
## పూర్తి షెడ్యూల్ ఇదే!



- 2026 ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవారి దర్శన, సేవల కోటాను ప్రకటించిన టీటీడీ
- నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభం
- నవంబర్ 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వర్చువల్ సేవల టికెట్ల విడుదల
- వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు 24న అందుబాటులోకి
- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, గదుల కోటాను నవంబర్ 25న విడుదల చేయనున్న టీటీడీ
- అన్ని బుకింగ్‌లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## నా పేరుతో వాట్సాప్‌లో మోసాలు..
# జాగ్రత్తగా ఉండండి



- ఫొటోషూట్‌ల కోసం ఫొటోగ్రాఫర్లకు మెసేజ్‌లు చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి
- తాను వ్యక్తిగత నంబర్ నుంచి ఎవరినీ సంప్రదించనని అదితి స్పష్టం
- పనులన్నీ తన టీమ్ ద్వారానే జరుగుతాయని వెల్లడి
- ఆ నంబర్‌తో ఎవరూ మాట్లాడవద్దని, అనుమానం వస్తే తన టీమ్‌కు చెప్పాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ప్రముఖ నటి అదితి రావు హైదరి తన పేరుతో వాట్సాప్‌లో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని అభిమానులను, ఇండస్ట్రీ వర్గాలను హెచ్చరించారు. తన ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకుని, ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫొటోగ్రాఫర్లను సంప్రదిస్తూ ఫొటోషూట్‌ల గురించి మాట్లాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు.

వివరాలు 2లో..

## కైలాసగిరిపై 50 అంతస్తుల ఐకానిక్ భవనం..
# కొత్తవలసలో థీమ్ సిటీ

- విశాఖ అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష
- వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సూచన
- జూన్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా నిర్మిస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్ల పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

వివరాలు 2లో..

## రామోజీరావు ఒక వ్యక్తి కాదు,
# శక్తిమంతమైన వ్యవస్థ



- రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘనంగా రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం
- రామోజీరావు జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు
- రామోజీరావు ఒక వ్యక్తి కాదు, శక్తి అని కొనియాడిన వెంకయ్యనాయుడు
- తెలుగు పోతే వెలుగు లేదంటూ మాతృభాష ప్రాధాన్యాన్ని వివరించిన మాజీ ఉపరాష్ట్రపతి
- జనహితమే జర్నలిజం అని నమ్మిన మహనీయుడు రామోజీరావు అని ప్రశంస

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బిందాస్ గా కూర్చుంటే.. అధికారం మళ్లీ దూరమవుతుంది భయ్యా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు బీహార్ ఎన్నికల ఫలితాలు వార్నింగ్ బెల్స్ లాంటివి. ఒకటి గమనించారా.. ఆంధ్రప్రదేశ్ లో 2024లో ఎన్నికలు తరహాలోనే బీహార్ లోనూ రెండో విడత ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరిగింది. అదీ సాయంత్రం ఐదు గంటల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు క్యూ లైన్ లో నిలబడి ఎన్డీఏ అభ్యర్థులకు ఓటు వేశారు. ఏపీలోనూ మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. అందుకే బీహార్ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమికి 202 స్థానాలు లభించాయి. అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. ఇక్కడ 2024 ఎన్నికల్లో వైసీపీకి కూడా కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అందుకే జగన్ ప్రస్తుత ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాను తిరిగి అధికారంలోకి వస్తానని కూర్చుంటూ మళ్లీ ఒకసారి బెంగళూరుకే పరిమితమవ్వాల్సి ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

### ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా...

ఇప్పుడు బీజేపీ కూటమి ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా విజయం సాధిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వంటి వాటిని వారు పెద్దగా పట్టించుకోరు. శాసనసభ ఎన్నికలపై సీరియస్ గా మోదీ నుంచి పార్టీ అగ్రనేతలందరూ దృష్టి పెడతారు. అప్పుడు కర్సయిపోయేది విపక్షంలో ఉన్నవారు మాత్రమే. ప్రభుత్వ వ్యతిరేకత తనకు అనుకూలంగా మారుతుందని భావించి జగన్ ఏ మాత్రం అలక్ష్యం వహించినా ఏపీలోనూ బీజేపీ బీహార్ వంటి స్ట్రాటజీనే అనుసరిస్తుంది. అందుకు ఎంత మాత్రం వెనకాడదు. చంద్రబాబు నాయుడు కూడా అదే నమ్మకంతో ఉన్నారు. తన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకంతో పాటు, మోదీ, పవన్ కల్యాణ్ చరిష్మాతో మరొకసారి విజయం సాధిస్తామన్న ఉద్దేశ్యంలో ఉన్నారు. అందుకే టీడీపీ ఇక ఎప్పటికీ ప్రతిపక్షంలో ఉండదని ఇటీవల చంద్రబాబు కామెంట్ చేయడానికి కారణం కూడా అదే కావచ్చు.

### సాఫ్ట్ కార్నర్ ఉన్నప్పటికీ...

అయితే బీజేపీకి జగన్ పై కొంత సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కనపడుతుందని వైసీపీ నేతలు భావించవచ్చు.. తమ్ముడు.. తమ్ముడే.. అన్నట్లు.. రాజకీయంలో కేవలం తమతో సఖ్యతగా ఉంటే సరిపోదు. బీజేపీ తమతో నేరుగా పొత్తు పెట్టుకున్న వారితో మాత్రమే ప్రయాణిస్తుంది. అవసరమైతే జగన్ పార్టీని ఓడించడానికి అన్ని శక్తియుక్తులను ఒడ్డుతుంది. మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో.. ఏపీలోనూ తమ ప్రభుత్వం రావడం అంతే ముఖ్యమని బీజేపీ భావిస్తుంది. అది రాజకీయం. అందులో ఎవరినీ తప్పుపట్టాల్సిన పనిలేదు. జగన్ బిందాస్ గా బెంగళూరులో కూర్చుని ప్రభుత్వ వ్యతిరేకత, తాను గతంలో చేసిన పనులు గెలిపిస్తాయని భావిస్తే మాత్రం జగన్ మరో తేజస్వి గా మారతారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ విషయం తెలిసి ఇప్పుడిప్పుడే వైసీపీ నుంచి నేతలు పెద్ద సంఖ్యలో బీజేపీ లో చేరే అవకాశాలను కొట్టిపారేయలేని పరిస్థితి. సో.. జగన్ బీ కేర్ ఫుల్.

### పవన్ కల్యాణ్ వల్ల ఇతర మతాల్లోకి వెళ్లిన హిందువుల్లో

# ఆలోచన మొదలైంది

- మొదటి పేజీ తరువాయి

చాటాలని ఆయన అన్నారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన కాపు కులస్తుల కార్తీక వన భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ముస్లింలకు కొమ్ముకాసే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మతం మార్చుకోవడం అంటే దేవుళ్లను మోసం చేయడమేనని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇతర మతాల్లోకి వెళ్లిన వారంతా 'ఘర్ వాపసీ' ద్వారా తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని కోరారు. అలా తిరిగి వచ్చేవారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు. హిందువుగా పుట్టడం గర్వకారణమని, హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని బండి సంజయ్ తెలిపారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మంపై చేస్తున్న ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన మొదలైందన్నారు. మోసపోయి ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని ఆదుకునే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. కులాలు తమ సామాజికవర్గ సంక్షేమం కోసం పనిచేస్తూనే, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. హిందూ సనాతన ధర్మ రక్షణే తన జీవిత లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# తిరుమల శ్రీవారి సేవల ఫిబ్రవరి కోటా...

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 2026 ఫిబ్రవరి నెలలో దర్శించుకోవాలని భావిస్తున్న భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసే తేదీల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి, తమ ప్రణాళికకు అనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 18న ప్రారంభం కానుంది.

### నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్

తిరుమల శ్రీవారికి నిర్వహించే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన ఉంటుంది. ఈ సేవా టికెట్లను టీటీడీ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తుంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఈ సేవల కోటా కోసం నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ నమోదు ప్రక్రియ నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు రుసుము చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

### నవంబర్ 21, 24 తేదీల్లో వివిధ టికెట్ల విడుదల

నవంబర్ 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచుతుంది. ఇక నవంబర్ 24వ తేదీన పలు ముఖ్యమైన దర్శన టోకెన్లను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

### నవంబర్ 25న ప్రత్యేక ప్రవేశ దర్శనం, గదుల కోటా

భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను

నవంబర్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. దర్శన టికెట్లతో పాటు వసతి సౌకర్యం కూడా ముఖ్యమే కాబట్టి, తిరుమల మరియు తిరుపతిలో గదుల కేటాయింపునకు సంబంధించిన

ఆన్‌లైన్ కోటాను కూడా నవంబర్ 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. భక్తులు శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ను మాత్రమే సంప్రదించాలని, నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే

# అది రాజ్యాంగం వల్లే

- మొదటి పేజీ తరువాయి

"సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఎడిటర్‌గా మారిపోతున్నారు. ఇష్టానుసారంగా వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి" అని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన 'ఒక వ్యక్తి–ఒక ఓటు' హక్కు ఒక గొప్ప వరమని చంద్రబాబు అభివర్ణించారు. "కొన్ని దేశాల్లో ఇప్పటికీ ప్రజలకు సమాన ఓటు హక్కు లేదు. కానీ, భారతదేశంలో పేద, ధనిక, స్త్రీ, పురుష బేధం లేకుండా అందరికీ సమాన ఓటు హక్కు ఉంది" అని ఆయన వివరించారు. సామాజిక,

ఆర్థిక సమానత్వం ఉన్న సమాజాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ విధానాలు ఈ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. "ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించాలన్నదే నా ప్రణాళిక. ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం కోరుతున్నాను" అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

# ఏపీ అభివృద్ధి అంతా డొల్ల... చంద్రబాబు విజన్ ఇదేనా?

- మొదటి పేజీ తరువాయి

మొదటి అర్ధభాగానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన గణాంకాలు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో చాలా నిరుత్సాహకరమైన వృద్ధిని వెల్లడిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు వేగంగా పెరుగుతాయని టీడీపీ, జనసేన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వ ఆర్థిక పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో గతేడాదితో పోలిస్తే కేవలం 7.03 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు వినియోగానికి అద్దం పడతాయి. ఈ రెండింటి ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే కేవలం 2.85 శాతం మాత్రమే పెరిగింది. గత రెండేళ్ల (2023–24 నుంచి 2025–26) మొదటి అర్ధభాగంలో రాష్ట్ర సొంత పన్ను రాబడి వార్షిక వృద్ధి రేటు (%జూ+=%) కేవలం 2.75 శాతంగా ఉంది. ఇది మరింత ఆందోళన కలిగించే విషయం. అయినా, రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని చంద్రబాబు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 2024–25లో 12.02 శాతం, 2025–26లో 17.1 శాతం జీఎస్‌డీపీ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని వారు చెబుతున్నారు. ఈ స్థాయిలో వృద్ధి ఉంటే పన్నుల రాబడి కూడా 12 శాతం నుంచి 15 శాతం వరకు పెరగాలి. కానీ వాస్తవ వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే. మరోవైపు, మూలధన వ్యయం గత రెండేళ్లలో మైనస్ 16 శాతం వార్షిక వృద్ధి రేటుతో క్షీణించడం మరింత బాధాకరం. 2019–24 మధ్య ఐదేళ్లలో రాష్ట్ర సొంత పన్ను రాబడి ఏటా సగటున 9.87 శాతం పెరిగింది. జీఎస్‌డీపీ వృద్ధి 10.23 శాతంగా నమోదైంది. ఆ గణాంకాలకు, ఇప్పటి వృద్ధికి పొంతన లేదు. మరి ఇంత తక్కువ రాబడి వృద్ధితో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు ఎలా చెప్పగలరు? ఈ ప్రభుత్వ హయాంలో వేగంగా దూసుకుపోతున్నది ఒక్క అప్పుల విషయంలోనే. ఇప్పటివరకు టీడీపీ కూటమి ప్రభుత్వం రూ. 2,06,959 కోట్లను అప్పుగా తీసుకుంది లేదా ఒప్పందాలు చేసుకుంది. ఇది గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో 62 శాతం అని గణాంకాలు చెబుతున్నాయి" అని జగన్ తన ట్వీట్ లో వివరించారు.

# రామోజీరావు ఒక వ్యక్తి కాదు, శక్తిమంతమైన వ్యవస్థ

రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తిమంతమైన వ్యవస్థ అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అభివర్ణించారు. స్వయంకృషి, క్రమశిక్షణ, పట్టుదలతో అనేక రంగాల్లో అద్భుత విజయాలు సాధించి, భావి తరాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రామోజీ ఫిల్మ్‌సిటీలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, "రామోజీరావు లేని ఆయన సంస్థలను ఊహించుకోలేకపోతున్నాను. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, అదొక శక్తి. జనహితమే జర్నలిజం అని నమ్మి ఆచరించిన మహామనీషి. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి, ప్రపంచమంతా తెలుగువారి వైపు చూసేలా ఎదిగిన ఆయన జీవితం యువతకు గొప్ప స్ఫూర్తి. ఆయన సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో లబ్ధి పొందారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయన స్థానం శాశ్వతం" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంపై రామోజీరావు వేసినంత బలమైన ముద్ర ఇటీవలి కాలంలో మరెవరూ వేయలేదని ఆయన అన్నారు.

విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రామోజీరావు జయంతి సందర్భంగా సత్కరించడం అభినందనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. "రామోజీరావు కేవలం వ్యాపారవేత్త మాత్రమే కాదు, తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన క్రాంతి దర్శి. సామాజిక నిబద్ధత అనే పునాదిపై తన విజయ సౌధాన్ని నిర్మించుకున్నారు. ఆయన పత్రికను ధర్మయుద్ధం కోసం ఉపయోగించారు. తెలుగు పోతే వెలుగు లేదు. మన మాతృభాషను కాపాడుకోవడమే మనం రామోజీరావుకు ఇచ్చే నిజమైన నివాళి" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, బండి సంజయ్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ పై సీఎం చంద్రబాబు మాటలను వక్రీకరిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన కృషితోనే కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.11,400 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున నీరు, విద్యుత్, పన్నుల రూపంలో మరో రూ.2,600 కోట్లు కలిపి దాదాపు రూ.14,000 కోట్ల ఆర్థిక సాయం అందింది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థకు ఈ స్థాయిలో అండగా నిలిచిన దాఖలాలు లేవు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదాన్ని నిజం చేస్తూ, కార్మికులు, నిర్వాసితుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం" అని వివరించారు. "ప్రభుత్వం ప్రజాధనాన్ని, పన్నుల రూపంలో వచ్చిన డబ్బును ప్లాంట్ కోసం వెచ్చిస్తోంది. కాబట్టి యాజమాన్యం, కార్మికులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావాలని చెప్పడమే ముఖ్యమంత్రి ఉద్దేశం. కానీ, వైసీపీ నాయకులతో కలిసి కొందరు ఆయన మాటలను వక్రీకరించి కార్మికులకు వ్యతిరేకంగా మాట్లాడినట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది అత్యంత దారుణం" అని పల్లా ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2000 సంవత్సరంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబు రూ.1350 కోట్లు, ఆ తర్వాత మరోసారి రూ.1440 కోట్లు తీసుకువచ్చి స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. "కేవలం 30 శాతం పనులు జరుగుతున్న ప్లాంట్‌ను 80 శాతం పనులు జరిగేలా చేశాం. ఈ రోజు స్టీల్ ప్లాంట్ నడుస్తోందంటే అది ఎన్డీయే కూటమి చలవే. ఈ నిజాన్ని కార్మికులు, ప్రజలు గ్రహించాలి. అనవసరంగా అధికారులపై బురదజల్లడం, కార్మికులలో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలను ప్రతిపక్షాలు మానుకోవాలి. ప్రభుత్వం, యాజమాన్యం, కార్మికులతో పాటు ప్రతిపక్షం కూడా బాధ్యతగా వ్యవహరించి, స్టీల్ ప్లాంట్‌ను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాలి" అని పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. ప్రజలు విజ్ఞులని, ఇలాంటి వక్రీకరణలను నమ్మబోరని, ఎన్డీయే కూటమిపై వారికి అపారమైన విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు.

### నా సోదరిని అవమానిస్తే ఊరుకోను:

# తేజ్ ప్రతాప్ యాదవ్ వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

తప్పుకుంటున్నట్లు ప్రకటించడం కలకలం రేపింది. ఎన్నికల ఓటమిపై ప్రశ్నించినందుకు తనను అవమానించి, ఇంటి నుంచి గెంటేశారని ఆమె ఆరోపించారు. ఈ పరిణామంపై ఆమె సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. తన సోదరిని అవమానించిన వారిని "గొయ్యి తీసి పాతి పెడతా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయానికి గల కారణాలను ప్రశ్నించిన తర్వాత తనను తీవ్రంగా అవమానించారని రోహిణి ఆరోపించారు. తన తండ్రికి కిడ్నీ దానం చేసిన విషయాన్ని అడ్డం పెట్టుకుని, పార్టీ టికెట్ కోసమే అలా చేశానని ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తేజస్వి యాదవ్ సన్నిహితుల ఆదేశాలతోనే ఇదంతా జరిగిందని ఆమె ఆరోపణలు చేశారు. ఈ ఘటనల తర్వాత రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. సోదరి ఉదంతంపై తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. "నాకు జరిగిన అవమానాన్ని నేను భరించాను. కానీ నా సోదరికి జరిగిన అవమానాన్ని సహించలేను. మా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న ద్రోహులను బీహార్ ప్రజలు క్షమించరు" అని హెచ్చరించారు. ఈ క్రమంలో తన తండ్రి లాలూ యాదవ్‌కు భావోద్వేగ పిలుపునిచ్చారు. "నాన్నా, ఒక్క సంకేతం ఇవ్వండి చాలు. ఈ ద్రోహులను ప్రజలే ఖననం చేస్తారు. ఇది పార్టీల పోరాటం కాదు, కుటుంబ గౌరవం, ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం పోరాటం" అని పేర్కొన్నారు. ఈ కుటుంబ వివాదంపై ఇతర పార్టీలు స్పందించాయి. జేడీయూ దీన్ని "యాదవ్ ఇంట్లో మహాభారతం"గా అభివర్ణించగా, ఆర్జేడీ మాత్రం ఇది కుటుంబ అంతర్గత విషయమని పేర్కొంది. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత యాదవ్ కుటుంబంలో మొదలైన ఈ అంతర్గత కలహాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కైలాసగిరిపై 50 అంతస్తుల ఐకానిక్ భవనం.. కొత్తవలసలో థీమ్ సిటీ

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విశాఖ నగరాభివృద్ధిలో భాగంగా వీఎంఆర్‌డీఏ చేపట్టిన 8 ఎంఐజీ ప్రాజెక్టులతో పాటు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నగరానికి ఐకాన్‌గా నిలిచేలా కైలాసగిరిపై 50 అంతస్తుల ఐకానిక్ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, కొత్తవలస వద్ద 120 ఎకరాల విస్తీర్ణంలో ఒక థీమ్ బేస్డ్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, జూన్ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. విశాఖ మాస్టర్‌ప్లాన్ డిజైన్‌ను కూడా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ఆయన వివరించారు. నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## బీహార్ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరేదెప్పుడంటే..!

- మొదటి పేజీ తరువాయి

నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 19న లేదా 20వ తేదీన బీహార్ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందుకు పాట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ మైదానంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారని సమాచారం. మరోమారు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని ఎన్డీయే కూటమి వర్గాలు పేర్కొన్నాయి. అయితే, నూతన సీఎం ఎవరనే దానిపై ఇప్పటి వరకూ అధికారికంగా ఎన్డీయే కూటమి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

### నా పేరుతో వాట్సాప్‌లో మోసాలు..

# జాగ్రత్తగా ఉండండి

- మొదటి పేజీ తరువాయి

ఈ విషయంపై తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. "కొంతమంది నా దృష్టికి తెచ్చిన ఓ విషయాన్ని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. వాట్సాప్‌లో ఎవరో నా ఫొటో పెట్టుకుని, నేనే అన్నట్లుగా ఫొటోగ్రాఫర్లకు మెసేజ్‌లు చేస్తున్నారు. అది నేను కాదు. నేను వ్యక్తిగతంగా ఎవరినీ ఇలా సంప్రదించను. నా పనులన్నీ నా టీమ్ చూసుకుంటుంది" అని ఆమె స్పష్టం చేశారు. అలాగే, "దయచేసి ఆ నంబర్‌తో ఎవరూ మాట్లాడొద్దు. అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే నా టీమ్‌కు తెలియజేయండి. నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని అదితి తన పోస్టులో పేర్కొన్నారు. అభిమానులు, సహచరులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన 'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్ సిరీస్‌లో అదితి రావు హైదరి నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. తెలంగాణలోని వనపర్తి రాజవంశానికి చెందిన అదితి, ఇటీవల వనపర్తి చీరల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం కూడా తెలిసిందే.

# లోతువానిగుంటలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం



**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 16 :**నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంటలో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి సుబ్బమ్మ కు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధం అయింది.సమాచారం తెలుసుకున్న నాయుడుపేట అగ్నిమాపక శాఖ వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచుకున్న రెండు లక్షల రూపాయల నగదు, బంగారు నగలు,ఇతర వస్తువులు,ఇంటి సామాగ్రి మంటలకు ఆహుతి అయ్యాయి. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు సుబ్బమ్మ కోరారు.

# బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఆర్య వైశ్యులు కార్తీకమాస పూజలు




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 16.** పరమేశ్వరుడికి అన్నాభిషేకం, సాలగ్రామాల దానం అత్యంత భక్తి శ్రద్ధతో చేశారని ,ఈ కార్యక్రమం తెల్లనాకుల సుబ్బారావు ,మరియు తట్టవర్తి శ్రీనివాసులు మొంట ఆనంద్, నేతృత్వంలో నిర్వహించారని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి గారు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో నేను పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలియజేశారు.. గత 20 సంవత్సరాలుగా ఆర్యవైశ్య సోదరులు ఈ కార్యక్రమాన్ని చేయడం చాలా అద్భుతమని ప్రశంసించారు . . కోవూరు శాసన సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి నాయకత్వంలో మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు, దీనికి తోడు ఆర్యవైశ్య సోదరులు చేసేటటువంటి ఇటువంటి పూజా కార్యక్రమాలు మున్సిపాలిటీ అభివృద్ధికి మరింతగా తోడ్పడుతాయని తెలియజేశారు.. పూజా కార్యక్రమాల అనంతరం గంగా హారతి నిర్వహించి కార్తీక దీపాన్ని కనిగిరి రిజర్వాయర్లో నిమజ్జనం చేశారని తెలియజేశారు. ఈ పూజ కార్యక్రమాలు అన్నీ కూడా సురేష్ స్వామి నిర్వహించారని, అలాగే కుమార్ స్వామి కూడా శివలింగం వద్ద పూజలు చేసి భక్తులకు హారతులు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యూత్, పలువురు ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు..

# సిఐటియూ ఆధ్వర్యంలో ఆర్టిసి డిపోలోని కార్మికుల నూతన కమిటీ ఏకగ్రీవం




**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 16,**పట్టణంలోని సిఐటియు కార్యాలయం నందు ఆదివారము ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికులు,ఔట్ స్కోరింగ్ కార్మికులు,వాటర్ బస్ క్లినిక్ గ్యారేజీలో పనిచేస్తున్న కార్మికులు, స్వీపర్లు,ఆఫీస్ బాయ్ కాంటాక్ట్ శ్రామిక మిత్రా పనిచేస్తున్న కార్మికులు నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని సిఐటియూ జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మిక వర్గము కలిసివచ్చి ఐక్యంగా పోరాడితే ఏ విషయమైనా సాధించగలరని,అలాగే తమ హక్కులను కాపాడడానికి కార్మికుల పక్షాన సిఐటియు అండదండలుగా ఉంటామని అన్నారు.కాగా ఇందులో నూతన కమిటీ అధ్యక్షుడిగా కామ్రేడ్ దావత్, కార్యదర్శిగా కామ్రేడ్ నిరంజన్,కోశాధికారి కామ్రేడ్ మోహన్, ఉపాధ్యక్షులుగా కామ్రేడ్ ఆనంద్,సహాయ కార్యదర్శులుగా గజేంద్ర,పూర్ణ,చాందిని సైమాన్,కమిటీ సభ్యులు గుర్రమ్మ,హనీష్, ఆఫ్రిజిల్,నీలిమ,కృష్ణమ్మలతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

# శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం

## నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షసూచన



**సూళ్లూరుపేట, పెన్ పవర్, నవంబర్ 16 :** శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి తమిళనాడు వైపు వెళ్లనుంది.

దీని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమ వైపు వీస్తున్నాయి. ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపారు.సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతిభారీ, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు, 18వ తేదీన నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ

శాఖ తెలిపింది. ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. వాయవ్య భారతం నుంచి గాలులు కోస్తా, రాయలసీమ వరకు వీస్తుండడంతో శనివారం చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, అల్పపీడనం రాగల 24గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, ఈనెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 24-27 తేదీల మధ్య కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# పలమనేరు పరిరక్షణ సమితి - ఏపీఎన్జీజీవో సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు





**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 16,**నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండలం మామడుగు అటవీశాఖ గజారామం నర్సరీ నందు ఆదివారం జరిగిన కార్తీక వనభోజనాలు ఘనంగా,సందడిగా నిర్వహించబడ్డాయి. పిల్లలు,మహిళలు, పలువురు కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం రంగు రంగులుగా మారింది.పి.పి.ఎస్ అధ్యక్షులు నరసింహులు,ఎన్జీఓ సంఘ అధ్యక్షులు ఆనందబాబు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా, సమాజంలోని అన్ని వర్గాలను ఒకేచోట చేర్చడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అని తెలుపుతూ మన సంప్రదాయాలను పునరుజ్జీవింపజేసే కృషిలో ప్రజల భాగస్వామ్యం మా ప్రయత్నాన్ని విజయవంతం చేసిందని పేర్కొన్నారు.ఉసిరి వనంలో సాంప్రదాయ బద్ధంగా భోజనాల ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమం విజయ వంతం కావడానికి నిర్వాహకులైన పి.పి.ఎస్.కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్ రెడ్డి,పొన్ముడి శ్రీపురం సీతారామయ్య, సుబ్రహ్మణ్యం పిళ్ళై, నారాయణ,రామచంద్ర, సన్నీరాజు,విజయ్ కుమార్,రెడ్డప్ప, నాగప్ప,వెంకట్, దొరస్వామి,సాంబయ్య, జీలు భాయ్,ఫర్హాన్, సునంద,వీరభద్రగౌడ్, జలాల్,సుదర్శనాచారి అంజమ్మ తదితరుల సేవలను పలువురు అభినందించారు.

మహిళలు,పిల్లల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తెచ్చింది.

ఉచితంగా బస్సులు అందజేసిన శ్రీ చైతన్య, బ్రహ్మర్షి,నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థలను ఈ సందర్భంగా అభినందించారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి నారాయణ,ప్రభాకర్ రాజు,ఎన్జీఓ కార్యదర్శి జయమ్మ,ఎన్జీఓ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్,గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు,సంఘం ఉపాధ్యక్షుడు హరి,జిల్లా అధ్యక్షులు రమణ, తులసినాథం నాయుడు,శేగు రాఘవయ్య, సుకుమార్,సత్యప్రకాష్, బాస్ అధ్యక్షులు రూపేష్,కాప్పల్లి రవీంద్ర రెడ్డి,కోటి,డాక్టర్ యుగంధర్,ఆనందతీర్థ తదితరులు పాల్గొన్నారు.

## లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్ర భవిత బంగారుమయం.. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్..






**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 16.**ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల ఏర్పాటుకు స్వర్గధామంగా మారిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే శనివారం ఓ పత్రికా ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ను ఆర్థిక అగ్రామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఐఐ సమ్మిట్ వేదికగా మారిందని చెప్పారు. రెండు రోజుల్లో పలు ప్రముఖ అంతర్జాతీయ%-%జాతీయ సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందాలను కుర్చుకుని రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు చర్యలు తీసుకుందని అన్నారు. ఇప్పటి వరకు ?5,22,471 కోట్ల పెట్టుబడులతో జరిగిన ఒప్పందాల ద్వారా 2,67,239 ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామని వెల్లడించారు. విండ్%-%సోలార్ హైబ్రిడ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, బయోఫ్యూయల్స్, పంప్డ్ హైడ్రా స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, అగ్రివోల్టాయిక్స్, పునరుత్పాదక ఇంధన తయారీ వంటి ఆధునిక రంగాల వైపు ప్రపంచ దిగ్గజ సంస్థల ఆసక్తి రాష్ట్ర సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలనే తరిమికొట్టారని, దీంతో యువత భవిత అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. ఐదేళ్లపాటు ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి తీసుకురాలేకపోయిన జగన్ .. క్రెడిట్ చోరీ అని చౌకబారు విమర్శలు చేయడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

# తెలుగు సాహిత్యంలో ఉమ్మడిశెట్టి రాధేయ కృషిఅపూర్వం

## మానవ హృదయ సంవేదనలకు అక్షర రూపం రాధేయ కవిత్వం

## కళామందిరంలో ఘనంగా రాధేయ కవిత్వ సంపుటి ఆవిష్కరణ



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 16,**పట్టణ సమీపంలోని సాయి గార్డెన్ సిటీలోని కళామందిరంలో ఆదివారం ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ ఉమ్మిడి శెట్టి రాధేయ కవితా సంపుటి పావుకోళ్ళు పుస్తకాన్ని కవి రచయిత పలమనేరు బాలాజీ ఆవిష్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ అధికారి జెల్ది విద్యాధరరావు హైదరాబాద్,కవులు డాక్టర్ పెళ్లూరు సునీల్ నెల్లూరు,డాక్టర్ అంకె శ్రీనివాస్ అనంతపురం, సుధా మురళి నెల్లూరు, వీణాభాయి హిందూపురం,పేరిసెట్ల శివకుమార్ నెల్లూరు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, కెవి మేఘనాథ్,ఆర్టీసీ జి శ్రీనివాస,డి.కుమారస్వామి రెడ్డి,తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాదం నాయుడు,పుష్ప, జనవిజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్, గిరిధర మూర్తి,రైతు సంఘం నాయకులు ఉమాపతి,ఉపాధ్యాయ నాయకులు గంటా మోహన్,ప్రముఖ రచయిత్రులు ఝాన్సీ పాపుదేశి,గండికోట వారిజ,కవులు బ్రహ్మంస, తొండవాని గోపీనాథ్, మురళి నాథ్,డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర, వేమన్న తదితరులు పాల్గొన్నారు.ప్రముఖ కవి అందెశ్రీకి నివాళి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించిన తర్వాత సభ ప్రారంభించారు.రెండు తెలుగు రాష్ట్రాల నుండి కవులు రచయితలతో బాటు నరహరి పేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శరత్చంద్రశేఖర్ పాల్గొన్నారు.కవిత్వం కవుల జీవన తాత్వికతను ప్రతిబింబిస్తుందని , మగ్గం బతుకు కవితా సంపుటితో అన్ని ప్రాంతాల పాఠకులను ఆకట్టుకున్న ప్రముఖ కవి డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ కవిగా విమర్శకుడిగా సాహిత్య కార్యక్రమాల నిర్వాహకుడిగా ఉమ్మడిశెట్టి అవార్డు వ్యవస్థాపకుడిగా అనేక రకాలుగా సాహిత్య సేవ చేస్తున్నారని వక్తలు కొనియాడారు.స్వీయ అస్తిత్వాలను,నేపథ్యాలను,జీవిత వాస్తవికతను కవిత్వం ప్రతిబింబిస్తుందని,తెలుగు సాహిత్యంలో నిలిచిపోయే కవిత్వాన్ని డాక్టర్ రాధేయ వెలువరించారని,ఎంతో నిబద్ధతతో ఎక్కడ రాజీ పడకుండా మంచి కవిత్వ సంపుటాలను ఎంపిక చేసి జాతీయస్థాయిలో ప్రఖ్యాతి చెందిన ఉమ్మడిశెట్టి సాహిత్య పురస్కారాలను ఆయన క్రమం తప్పకుండా గత మూడు దశాబ్దాలుగా అందిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు.పలమనేరు రచయితల సంఘం,తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి తరపున రచయితలు కవులు కవి రాధేయను ఘనంగా సత్కరించారు.ప్రముఖ కవి అందెశ్రీ పాటలను గిరిధరమూర్తి,తెలుగు పద్యాలనుచిన్నారి జ్ఞాన దీప్తి ఆలపించారు.

# చారిత్రాత్మిక వేదికగా నిలిచిన విశాఖ సిఐఐ సదస్సు

- పెట్టుబడులకు ఏపీని గమ్య స్థానంగా నిలిపిన చంద్రబాబు
- అన్ని ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు
- వేగంగా అభివృద్ధి చెందనున్న రాయలసీమ

**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 16,**ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మిక వేదికగా విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు.విశాఖలో రెండు రోజులు పాటు జరిగిన సిఐఐ సమ్మిట్ విజయవంతం కావడంపై పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడడం మాత్రమే కాదని మన రాష్ట్రంపై గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరిం చిందన్నారు. పెట్టుబడులు ఒక ప్రాంతానికి మాత్రమే కాకుండా రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా రావడం ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అనుసరిస్తుంటే ఏపీ అందుకు భిన్నంగా స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ ను అనుసరిస్తుండడం తో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడు తున్నాయన్నారు.

మొత్తం 613 ఒప్పందాల ద్వారా 13,25,716 కోట్ల పెట్టుబడులు,16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్ర అభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం అని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల హబ్ గా మార్చేందుకు సీఎం చంద్రబాబు మరియు మంత్రి లోకేష్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి వారిరువురు ప్రధాన పరిశ్రమను తీసుకొచ్చి అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని తెలిపారు. ఈ సమ్మిట్ లో పవర్ సెక్టర్ లో కుదుర్చుకున్న అధిక శాతం పెట్టుబడులు రాయలసీమకే రావడం ఈ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఎంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమవుతోందన్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు డ్రోన్ హబ్ గా, అనంతపురం, కడప,కర్నూలు జిల్లాలు రెన్యూవల్ ఎనర్జీ హబ్ గా,తిరుపతి మ్యానుఫ్యాక్చరింగ్, చిత్తూరు టెక్స్టైల్ హబ్ లుగా నిలువ నున్నయన్నారు.ఇక రాయలసీమ కేంద్రంగా ఏరో స్పేస్ రంగాల్లో 1200 కోట్లతో రేమాన్ సంస్థ పెట్టుబడులు పెట్టడం భవిష్యత్తులో రాయలసీమ ఏరోస్పెస్ సిటీగా ఎదిగేందుకు దోహదం కానందున్నారు.గతంలో రాయలసీమలో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేసిన కంపెనీలు ఇప్పుడు ప్రభుత్వ స్థిరత్వం, పారదర్శకత చూసి ముందుకు వస్తుండడంతో రాయలసీమ వేగంగా అభివృద్ధి చెందనుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశంలో ఆయనతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# అధినేత పిలుపు కదం తొక్కుతున్న కార్యకర్తలు

కోటి సంతకాలలో భాగస్వామ్యులైన చెంబేడు యువత



**పెళ్లకూరు, పెన్ పవర్, నవంబర్ 16** వైద్య విద్యను అభ్యసించి, ప్రజలకు వైద్య సేవలు అందించాలనుకుంటున్న పేద విద్యార్థుల స్వప్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమాధి చేస్తోంది. ఈ దిశగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయంపై వైయస్ఆర్సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారు.ఈ మేరకు మండలంలోని చెంబేడు గ్రామ పంచాయతీ నందు సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ కిలివేటి సంజీవయ్య,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆదేశాలు మేరకు,వైసీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు.ఈ మేరకు నియోజకవర్గ వాలంటీర్ వింగ్ అధ్యక్షులు శ్రీపురం మునిరాజ చెంబేడు గ్రామంలో వైద్యా కళాశాలను ప్రవేటీకరణను గ్రామంలోని యువతకు వివరిస్తూ సంతకాలు సేకరించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన మోసపూరితంగా సాగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు.గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా కేంద్రంతో పోరాడి 17 మెడికల్ కళాశాలను తీసుకువస్తే, వాటిని కుట్ర పూర్వకంగా ప్రవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పన్నాగం పడుతున్నారని విమర్శించారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి గతంలో విద్య వ్యవస్థలు అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ , నాడు నేడుతో పాఠశాల రూపురేఖలను మార్చారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో చెంబేడు యువత రోసనూరు చిరంజీవి,రోసనూరు విజయ్,రోసనూరు పోలయ్య,సౌటూరు నాగరాజు,సౌటూరు రమణయ్య,పిన్నబత్తిన వర్మ,చిరంజీవి,మాస్,ప్రసాద్,మూరాతొట్టి రాజరత్నం,నలుగూరి విజయ్ నారాయణ,చెంబేటీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# సాక్షులను కాపాడుకో గోవిందా!

## -డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , నవంబర్ 16 :** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తులు తమ ఇష్టదైవం తిరుమల ఏడుకొండల స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించే పరకామణిలో గతంలో జరిగిన దొంగతనం కేసులో ఉన్న సాక్షులను కాపాడుకో గోవిందా అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు వెంకన్న స్వామిని ప్రార్థించారు.పోలీసు అధికారినే హతమార్చే సాహసం చేశారంటే...ఇక సామాన్యులు ఒక లెక్కనా అని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి పాలకులు మూలన పడేసిన పరకామణి దోపిడీ కేసును పునర్విచారణ చేయడానికి హైకోర్టును ఆశ్రయించి తద్వారా దర్యాప్తు చేపట్టేలా చేసిన పాత్రికేయుడు మాచర్ల శ్రీనివాసులుకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి, దుర్మార్గుల పాలిట సింహస్వప్నంలా ఉండిన స్వర్గీయ పరిటాల రవీంద్ర హత్య నుండి నేటి పరకామణి దోపిడీకి సంబంధించిన కేసులలో పాత్రధారులు అనుమానాస్పద రీతిలో మరణించడానికి సూత్రధారులే కారణం అని ఆరోపించారు.మాజీ మంత్రి, జగన్ రెడ్డి సొంత బాబాయ్ హత్యోదంతంలో కూడా సూత్రధారులు ఎవరో నిర్ధారణ కాకుండానే ఆరుగురు పాత్రధారులు మరణించడం, దాని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి జగన్ రెడ్డి అని లోకమంతా విశ్వసిస్తున్నదని తెలిపారు.పరకామణి దొంగతనం కేసులో ప్రధాన ఫిర్యాదిగా ఉన్న నాటి టిటిడి విజిలెన్స్ ఎస్పై సతీష్ కుమార్ అడ్డు తొలగించే అవసరం ఉన్నది కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రవికుమార్, వైవి సుబ్బారెడ్డి,కరుణాకర్ రెడ్డి, నాటి ఈవో ధర్మా రెడ్డి, పోలీసు అధికారులు, టిటిడి విజిలెన్స్ అధికారులకే అని, కాబట్టి వీరందరిపై హత్య కేసు నమోదు చేసి,

తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.పరకామణి చోరీ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న రవికుమార్,కేసుతో సంబంధం కలిగి ఉన్న ప్రతీ ఒక్క నిందితుడికి, ఫిర్యాదిదారులకు, విచారణాధికారులకు

మరియు సాక్షులను సూత్రధారుల నుండి ప్రమాదం ఎదురు కాకుండా తగిన పోలీసు రక్షణ కల్పించి, అంతిమ లబ్ధిదారులు మరియు అసలు సూత్రధారులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరిస్తాం

## త్వరలో మండల, గ్రామ కమిటీల ఏర్పాటు

## శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్.






**శ్రీకాళహస్తి,పెన్ పవర్ నవంబర్ 16 :** ?శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళు న్నామని శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నాడు ఆయన శ్రీకాళహస్తిలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో జనసేన పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరించే లక్ష్యంతో, త్వరలోనే ప్రతి మండలంలో జనసేన పార్టీ మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మండల కమిటీల ఆధ్వర్యంలోనే గ్రామ కమిటీలను కూడా రూపొందించి, పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.?జనసేన పార్టీ ఆశయాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మీడియా మిత్రుల సహకారం అత్యంత కీలకమని సాయి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు వాస్తవమైన సమాచారం చేరేలా మీడియా సహకరించాలని ఆయన కోరారు.

?ఈ ఆత్మీయ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, గరికపాటి చంద్ర, జయ ప్రకాష్, మహేష్, పసుపులేటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాపు భవనానికి రూ. 25 లక్షలు విరాళం అందిస్తాను

**కావలి: పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్ )నవంబర్ 16**





ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కావలిలో కాపు భవనం నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నాని, మీరు ప్రారంభిస్తే వెంటనే నా బాధ్యతను నెరవేర్చుతానని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మరోసారి కాపు సోదరులకు గుర్తు చేశారు. ఆదివారం కావలి పట్టణంలోని ఏటూరి రామిరెడ్డి తోటలో కాపుల కార్తీక వనభోజన మహెూత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కి ఆహ్వాన కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన జరగగా, చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరచిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించి మోమెంటోలు అందజేశారు. అనంతరం ఆహ్వాన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాపు సోదరులందరికీ కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు. కాపు సమాజం సేవా తత్వం, ధైర్యం, నిబద్ధతకు ప్రతీక అని గుర్తుచేశారు. చరిత్రపరంగా ప్రజలను రక్షించిన ధీశాలి కులం కాపులన్నారు. అందుకే ఎక్కువ మంది కాపులు సైన్యం, పోలీస్ శాఖల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. కావలిలో సామాజిక సమగ్రత, కుల సంఘీభావం మరింత బలపడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రాజకీయాలు పక్కన పెట్టి, కాపు సమాజం ఒక్క వేదికపై కలిసి ఉండాలని, అదే నిజమైన శివపార్వతుల ఆశీస్సులకు అర్హతని అన్నారు. నన్ను సొంత బిడ్డలా ఆదరించి ఎమ్మెల్యే గా చేసిన ఋణం మర్చిపోలేనన్నారు. రామలక్ష్మణుల్లా అన్నదమ్ములుగా కలిసి కావలిని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సోదరులు, మహిళలు, యువత పాల్గొన్నారు..

# అఖిల భారత రజక సేవా సంఘం - ఎమ్మెల్యే గళ్ళ మాధవి



**పెన్ పవర్, గుంటూరు, నవంబర్ 16,**నంద్యాల వారి ఆహ్వానం మేరకు నంద్యాల పట్టణంలోని ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం నందు జరిగిన 18వ రజక బంధువుల ఆత్మీయ కార్తీక వన భోజనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రసంగించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి.

# ఈ నెల 17వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం..

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం (పెన్ పవర్ )నవంబర్ 16 :**ఈ నెల 17వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక %-మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.



## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు నిరంతరం అందేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి

- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్





**పెన్ పవర్, నవంబర్ 16, అద్దంకి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందేలా నిరంతరం అధికారులు పర్యవేక్షణ చేయాలని విధ్యుత్ శాఖ మంత్రి రవికుమార్ అన్నారు. నియోజకవర్గం లోని బల్లికురవ మండలం రామాంజనేయపురం వద్ద ముక్తేశ్వరం మేజర్ కాలువను మంత్రి గొట్టిపాటి పరిశీలించారు.

ఇటీవల స్థానిక రైతులు కాలువలో చిల్ల చెట్లు ఎక్కువగా పెరిగిపోవడం వలన పంట పొలాలకు నీరు సక్రమంగా అందడం లేదని మంత్రి రవికుమార్ కి రైతులు చరవాణి ద్వారా సమస్యను తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పూడిక పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు.

ఆదివారం కాలువను ప్రత్యక్షంగా పరిశీలించి, పూడిక పనుల పురోగతిని సమీక్షించారు. నీటి ప్రవాహం సాఫీగా వ్యవసాయ భూములకు చేరేలా అవసరమైన అన్ని చర్యలను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు నిరంతరం అందేలా పర్యవేక్షణను మరింత బలపర్చాలని అధికారులకు మంత్రి రవికుమార్ సూచించారు.ఈ కార్యక్రమం లో యన్ యస్ పి అధికారులతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుంది - విద్యుత్ శాఖ మంత్రి





**పెన్ పవర్, నవంబర్ 16, అద్దంకి:** ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని విధ్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. నియోజకవర్గం లోని జె పంగులూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేసారు. ముందుగా తూర్పు కొప్పెరపాడు గ్రామం లో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు ను 20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు.అంతే కాకుండా నియోజకవర్గం వ్యాప్తంగా 6.90 కోట్లతో 20 కమ్యూనిటీ హాళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సీఎస్ఆర్, దాతల ఆర్థిక సాయంతో నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పీ4 పిలుపులో భాగస్వాములవుతున్న దాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా పింఛన్లపై ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుందని మంత్రి రవికుమార్ తెలిపారు.ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ఇటీవలే లక్షకు పైగా స్పౌజ్ పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు రానున్నాయన్నారు.పారిశ్రామికవేత్తల్లో సీఎం చంద్రబాబు నింపిన విశ్వాసంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు,యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా వైజాగ్ లో పారిశ్రామికవేత్తల సమావేశం జరిగిందన్నారు.నిరుద్యోగ యువతకు భవిష్యత్తులో మన రాష్ట్రంలోనే ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు.అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.





## అభివృద్ధిలో ముఖ్యమంత్రి అసలు రాజీపడరు : ప్రత్తిపాటి

- సీ.ఆర్ పార్క్ అభివృద్ధి గురించి ఐఏఎస్ అధికారి కృష్ణతేజతో మాట్లాడతాను
- స్థానిక సీ.ఆర్.పార్క్ లో వాకర్స్ క్లబ్ నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో మాజీ ప్రత్తిపాటి.




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 16 :** చిలకలూరిపేట : పార్కులు, చెరువులు, శ్మశానాల అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసలెప్పుడూ రాజీపడరని, పట్టణాలు, గ్రామాల్లోని చెత్తను ఏ రోజుది ఆ రోజే జనావాసాలకు దూరంగా తరలిస్తున్నారని, నగరాలు, పల్లెల శుభ్రతతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉందని మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ లోకి తీసుకొచ్చి, ఆదాయం పెంచి, ప్రజల సంపద పెంచాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఉన్నారని ఆయన చెప్పారు. సీఐఐ సదస్సును విజయవంతంచేసి పెట్టబడులు ఆకర్షించడంలో ముఖ్య మంత్రి సూపర్ సక్సెస్ అయ్యారని ప్రత్తిపాటి చెప్పారు. పట్టణంలోని సీ.ఆర్ కాలనీ పార్క్ లో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమానికి ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

**చిలకలూరిపేట ఆణిముత్యం ఐఏఎస్ కృష్ణతేజ**

నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారు మన ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ ముందే ఉంటారని ప్రత్తిపాటి చెప్పారు. ఐఏఎస్ అధికారి కృష్ణతేజ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పడం అందరం గర్వించాల్సిన విషయమన్నారు. చిలకలూరిపేట ఆణి ముత్యమైన కృష్ణతేజ సీ.ఎస్.ఆర్ నిధుల్ని సమాజపురోభివృద్ధికి వినియోగిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. నిన్ననే ఆర్.వీ.ఎస్ పాఠశాల మరమ్మతులు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి కృష్ణతేజ రూ.40 లక్షలు అందించారని తెలిపారు. సీ.ఆర్. పార్కును ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేయడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని, అవసరమైతే మున్సిపాలిటీ నిధులు కూడా కేటాయిస్తామన్నారు. ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ప్రహరీ గోడ మరమ్మతులు. రంగులు వేసే పనులు, పార్క్ కు ఎదురుగా టాయిలెట్ల నిర్మాణం, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు, పార్క్ సంరక్షణకు ఇద్దరు వాచ్ మెన్ లు, నేమ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరుతూ నిర్వాహకులు, సభ్యులు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పఠాన్ జాఫర్ ఖాన్, గుడిపల్లి సాంబశివరావు, అరెకట్ల కోటి సుబ్బారావు, చిరుమెళ్ళ శ్రీనివాసరావు, రామ సుబ్బారావు, గ్రంథి భాస్కర్ రావు, మోహన్ రావు, మారెళ్ళ అప్పారావు, గట్టినేని రమేష్, పిల్లి కోటేశ్వరరావు తదితరులున్నారు.

## ప్రభుత్వం లక్ష్యాన్ని నీరుగార్చేలా టిడ్కో ఇళ్లను అద్దెకివ్వడమేంటి? : ప్రత్తిపాటి

- నివాసాలు లేని నిరుపేదలకోసం నిర్మించిన ఇళ్లను నిరుపయోగంగా మార్చడంపై ఎమ్మెల్యే ఆగ్రహం
- తాళాలు పొంది ఇళ్లను అద్దెకిచ్చి వేరేప్రాంతాల్లో ఉండేవారి కేటాయింపులు రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వముందన్న ప్రత్తిపాటి.
- కూటమి నాయకులు, అధికారులతో కలిసి టిడ్కో గృహాలు తనిఖీ చేసి, నివాసముండే వారిని ప్రశ్నించిన ప్రత్తిపాటి.





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 16 : చిలకలూరిపేట:** 2014–19లో టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని పేదలకు 5,520 టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభించిందని, పేదలకు నాణ్యమైన ఇళు నిర్మించి ఇవ్వాలనే గొప్ప ఉద్దేశంతో చేపట్టిన ప్రాజెక్టును గత ప్రభుత్వం నీరు గార్చిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ఆదివారం ఆయన పట్టణంలోని ఎన్టీఆర్ నాగర్ లో ఉన్న టిడ్కో గృహాల సముదాయాన్ని కూటమి నాయకులు, మున్సిపల్, పోలీస్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు., ఈ సందర్భంగా అక్కడ నివాసముం టున్నవారిలో ఎక్కువమంది అద్దెదారులేనని, అసలు యజమానులు కాదని గుర్తించిన ప్రత్తిపాటి... ఇళ్ల యజమానుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారి వివరణ తీసుకొని, అవసరమైతే ఇళ్లు రద్దుచేయాలని అధికారుల్ని ఆదేశించారు. స్టేజ్–2లోని టిడ్కో ఇళ్ల నిర్మాణపనుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి.. పనుల నాణ్యత, వసతుల కల్పనపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**మార్చి నాటికి 5,520 గృహాల్లో నిజమైన అర్హులు గృహ ప్రవేశాలు చేసేలా చూడండి**

వచ్చే మార్చినాటికి మొత్తం 5,520 ఇళ్లను పూర్తిచేసి, మౌలికవసతులు కల్పించి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోకుంటే వారి రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం పునరాలోచన చేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే 90శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసముండకుండా అద్దెలకు ఇచ్చి, తమకు నచ్చిన చోట నివాసముండటం సరికాదని, అద్దెలు కూడా కట్టలేని నిరుపేదల కోసమే ఇళ్ల నిర్మాణం చేపట్టామని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే అర్హులకు 1008 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. వారంతా ఇళ్లల్లో ఉంటేనే ఇంటి తాళాలు ఇస్తామని, నివాసం లేకుంటే ప్రభుత్వానికి అప్పగించాలని ప్రత్తిపాటి సూచించారు. 5,500 మంది పేదలు ఉంటారనే దుకాణ సముదాయాలు, ప్రభుత్వ భవనాలు. ఇతరత్రా అన్ని హంగులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడం మంచి పద్ధతికాదని ప్రత్తిపాటి సూచించారు.

**ఇళ్లు పొందినవారి కేటాయింపులు రద్దుచేసి,తక్షణమే అర్హులైన వారికి కేటాయించండి : తోట రాజా రమేష్ (నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్)**

2014లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచనలకు కార్యరూపమిస్తూ నాటి నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఇళ్లులేని పేదలకోసం 52 ఎకరాల్లో దాదాపు 5వేల గృహాలు కేటాయించడం జరిగిందని నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజారమేశ్ తెలిపారు. టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసముండకపోవడంతో ఇళ్లలోని వస్తువులు, తలుపులతో సహా దొంగిలిస్తున్నారని చెప్పారు. ఇళ్లు పొందినవారు వాటిని సద్వినియోగం చేసుకోకపోవడంతో అర్హులైన నిజమైన పేదలకు ఇళ్ల మంజూరు జరగడం లేదన్నారు. 52 ఎకరాల్లోని ప్రతి ఇంటిని పరిశీలించి నివాసముండని వారి కేటాయింపులు రద్దుచేసి, అర్హులైన ఇతరులకు ఇళ్లను కేటాయించాలని రాజా రమేశ్ ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కోరారు.

**పార్కింగ్ స్థలంలో వేసిన షెడ్లను తొలగిస్తాం : మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్.**

పార్కింగ్ స్థలాన్ని షెడ్లు వేసి ఆక్రమించడంపై మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, ఛైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తంచేశారు. పై అంతస్తుల్లో ఉండేవారికోసం కేటాయించిన స్థలాల్ని కింద ఉండేవారు తమ అవసరాలకు వాడుకోవడం సరికాదని, అలా చేస్తే వారు వేసిన షెడ్లను పూర్తిగా తొలగిస్తామని వారు నివాసముండే వారిని హెచ్చరించారు.

టిడ్కో గృహాల పరిశీలనకు వెళ్లిన వారిలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జనసేన పట్టణ అధ్యక్షులు మునీర్ హాసన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్ , జంగా వినాయకరావు, మురకొండ మల్లిబాబు, పట్టణ సిఐ రమేష్, టిడ్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి 1కేజీ 480 గ్రాముల వెండి కిరీటము బహూకరించిన దేరంగుల వెంకటేశ్వర్లు ధర్మపత్ని అంజమ్మ

**పెన్ పవర్, నవంబర్ 16, అద్దంకి:** అద్దంకి మండలం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి కిచిలకలూరిపేట మండలం ఇ టి సెంటర్ వాస్తవ్యులు దేరంగుల వెంకటేశ్వర్లు ధర్మపత్ని అంజమ్మ గారు వారి కుమారులు రామాంజనేయులు, చిరంజీవి ,మనవడు వీరాంజనేయులు కలసి 2,80,000 రూపాయలు 1కేజీ 480 గ్రాముల వెండి కిరీటము బహూకరించారు. దేవస్థాన పాలక అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకర్ రావు ఈ వెండి కిరీటం ను అందించారు .కిరీటం దాతలను స్వామివారి పూజా తదనంతరం వేద పండితులు సన్మానించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం ఇచ్చి తీర్థ ప్రసాదములు ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం



పాలకమండలి సభ్యుడు బత్తుల చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి...





**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 16.**గుంటూరు అరండల్‌పేటలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావులు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.

గ్రంథాలయాల నిర్మాణానికి పునాది వేసిన మహోన్నతులు, ఉద్యమకారుల సేవలను స్మరించుకుంటూ, నవంబర్ 14 నుంచి వారం రోజులపాటు గ్రంథాలయాల మహోత్సవాల ద్వారా భావితరాలకు తెలియజేసే కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అరండల్‌పేట గ్రంథాలయం నుంచి ర్యాలీ రూపంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

నేటి సామాజిక మాధ్యమాల యుగంలో పిల్లలు, యువత గ్రంథాలయాల వైపు మళ్లాల్సిన అవసరం మరింత పెరిగిందని పేర్కొన్నారు. గ్రంథాలయం అనేది నాలుగు గోడల మధ్య పుస్తకాల సమాహారం మాత్రమే కాకుండా, 'జ్ఞాననిధి' అని, ప్రతి ఒక్కరూ జ్ఞానార్జన కోసం గ్రంథాలయాలను ఆశ్రయించాలన్నారు. దేవాలయాలంతే గ్రంథాలయాలు కూడా సమాజానికి అవసరమయ్యాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తు చేశారు.గ్రంథాలయాల ద్వారా అనేక గొప్ప వ్యక్తులు తమ భావజాలం, విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించారని, అలాంటి స్థలాలను పునరుజ్జీవింపజేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో లైబ్రరీల అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు.

అలాగే, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో సాంకేతికతతో కూడిన ఐకానిక్ లైబ్రరీ ఏర్పాటు చేస్తూ రాష్ట్రానికి నూతన దిశ చూపుతున్నారని అభినందించారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదుబీ మనిషి వెల్నెస్, హెల్త్, ఆనందం కూడా అభివృద్ధి భాగమే అని నారా చంద్రబాబు నాయుడు చెప్పిన స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రంథాలయ కమిటీ సభ్యులు, నాయకులు, నిర్వాహకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## (సుప్రీం కోర్టు) ప్రధాన న్యాయమూర్తి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన.. ఎస్పీ వకుల్ జిందల్...



**పెన్ పవర్,గుంటూరు, నవంబర్, 16.**మంగళగిరి లోని %జఖ% కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి భారత దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి. ఆర్. గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.


ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రధాన న్యాయమూర్తి ని మర్యాదపూర్వకంగా కలిసి, పోలీస్ గౌరవ వందనం సమర్పించి, పుష్పగుచ్ఛం అందించి, ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## దుమ్ము లేపుతోన్న జెన్ జెడ్... తాజాగా మరో దేశానికి ఎఫెక్ట్!

ఇటీవల కాలంలో పలు సమస్యలపై స్పందించే విషయంలో జనరేషన్ జెడ్ ఏమాత్రం తగ్గడంలేదు. ఇందులో భాగంగా గతంలో బంగ్లాదేశ్ లోనూ, నేపాల్ లోనూ ప్రభుత్వాలను తలకిందులు చేసే విషయంలో వారి నిరసనలు కీలకంగా మారగా.. ఇటీవల పీఓకే లోనూ విద్యార్థులు పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్ లకు వ్యతిరేకంగా గళం ఎత్తారు. ఈ క్రమంలో మెక్సికోలోనూ జెన్ జెడ్ ఎఫెక్ట్ తెరపైకి వచ్చింది.

అవును... మెక్సికోలోని పశ్చిమ రాష్ట్రమైన మిచోకాన్ లోని ఉరుపాన్ (దివంగత) మేయర్ కార్లోస్ మాంజో మరణానంతరం జెన్-జెడ్ రోడ్లపైకి రావడం మొదలుపెట్టింది. ఈ సమయంలో మెక్సికోలో పెరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వ భద్రతా విధానాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ వేలాది మంది ప్రజలు, ప్రధానంగా జెన్-జెడ్ యువత నగరాల్లోని వీధుల్లోకి వచ్చారు.ఈ సందర్భంగా "కార్లోస్ చనిపోలేదు.. ప్రభుత్వమే అతన్ని చంపింది" అంటూ మెక్సికో నగరంలో ప్రదర్శనకారులు నినాదాలు చేశారు. ఇదే సమయంలో.. మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షీన్ బామ్ నివసించే, పనిచేసే నేషనల్ ప్యాలెస్ చుట్టూ ఉన్న లోహపు కంచెలను కూడా ముసుగులు ధరించిన నిరసనకారులు కూల్చివేశారు. దీంతో.. పోలీసులు టియర్ గ్యాస్ తో స్పందించారు.

# తెలుగుజాతి ఆణిముత్యం రామోజీరావు.. నా రాజకీయ రంగ ప్రవేశానికి ఆయనే మార్గదర్శి : ప్రత్తిపాటి





**గత ప్రభుత్వ వేధింపులు లేకుంటే ఆయన నేటికీ మనతో ఉండేవారు**

**స్వర్గీయ రామోజీరావు 89వ జన్మదినం సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఆ మహనీయునికి నివాళులు అర్పించి, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 16 :** తెలుగుజాతి ఆణిముత్యం రామోజీరావని స్వయంకృషి, పట్టుదలతో ఎదిగిన ఆయన వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శమని, వినోదం, విజ్ఞానంతో కూడిన ప్రసారాలు అందించే ఈటీవీ, ప్రజల మన్ననలు పొందిన ఈనాడు దినపత్రికల స్థాపన నిర్వహణలో తనదైన ముద్ర వేశారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రామోజీరావు 89వ జయంతి సందర్భంగా ఆయన ఖ్యాతిని, సేవల్ని స్మరించుకున్న ప్రత్తిపాటి. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కూటమి నాయకులతో కలిసి స్వర్గీయ రామోజీరావు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, తన జీవితాంతం ప్రజాహితాన్ని కాంక్షించే ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఆ మహనీయునితో తనది ప్రత్యేక అనుబంధమన్న ప్రత్తిపాటి... తన రాజకీయ రంగ ప్రవేశంలో ఆయనది కీలకపాత్ర అని, తనను నడిపించిన మార్గదర్శి ఆయనని ప్రత్తిపాటి చెప్పారు. ఎప్పుడు కలిసినా ఎంతో ఆప్యాయంగా,ఏకాంతంగా మాట్లాడేవారని ప్రత్తిపాటి చెప్పారు. ఒక సందర్భంలో ఆయన రెండుగంటలపాటు తనతో మాట్లాడి, ఎన్నో విలువైన సూచనలు చేశారన్నారు. తెలుగువారి హృదయాల్లో రామోజీరావుది చెరగని స్థానమని, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రముఖుల మన్ననలు చూరగొన్నారని ప్రత్తిపాటి కొనియాడారు. గొప్ప వ్యక్తి జన్మదినాన్ని పురస్కరించుకొని నేడు ఉభయతెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, ఇతర ప్రముఖులు రామోజీ ఎక్స్ లెన్సీ అవార్డ్స్ అందించడం తెలుగుజాతి గర్వించాల్సిన విషయమన్నారు.

**గత ప్రభుత్వ వేధింపులు లేకుంటే ఆయన మనతోనే ఉండేవారు**

గత ప్రభుత్వ వేధింపులు. కక్షసాధింపులతో రామోజీరావు ఇబ్బంది పడ్డారని, ఆ వేదన లేకుంటే ఆయన మనతోనే ఉండేవారని ప్రత్తిపాటి చెప్పారు. రామోజీరావు ఉసురు తగిలే గత పాలకులు 11 సీట్లకు పడిపోయారని, పెద్దల్ని, ఉన్నతస్థానాల్లో ఉన్నవారిని వేధించి పెద్ద తప్పుచేశారని ప్రత్తిపాటి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, బత్తినేని శ్రీనివాసరావు, పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తు కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు పోరాటం - విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్





**6.90 కోట్లతో 20 కమ్యూనిటీ హాళ్లు**

**కొప్పెరపాడులో బీసీ కమ్యూనిటీ హాలు ప్రారంభం**

పెన్ పవర్,నవంబర్ 16,అద్దంకి: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, అన్ని వర్గాల వారికీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గం, జే.పంగలూరు మండలంలోని టి.కొప్పెరపాడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన బీసీ వడ్డెర కమ్యూనిటీ హాలును, గోకులం షెడ్డును ఆదివారం నాడు మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 6.90 కోట్ల వ్యయంతో 20 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం ప్రారంభించినట్లు వివరించారు. ఇందులో తొలుతగా నిర్మాణం పూర్తి చేసుకున్న వడ్డెర కమ్యూనిటీ హాలును అతి తక్కువ సమయంలో నాణ్యతగా నిర్మించారని కితాబునిచ్చారు. కమ్యూనిటీ హాళ్లను వివిధ కార్పొరేట్ సంస్థలతో పాటు పరిశ్రమల యాజమాన్యాలు, దాతలు తమ సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి ముందకు వస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కొప్పెరపాడు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విద్యుత్ సంస్థల నుంచి 20 లక్షల సీఎస్ఆర్ నిధులను అందజేసిందని విషయాన్ని మంత్రి గొట్టిపాటి వివరించారు. ఊరిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని మంత్రి గొట్టిపాటి అధికారులకు సూచించారు. ఊరి బయట నిర్మిస్తే ఎవరికీ ఉపయోగం ఉండదన్నారు. జే.పంగలూరు మండలంలో 40 లక్షలతో నిర్మిస్తున్న కొండమూరు ఎస్సీ కమ్యూనిటీ హాలు, 20 లక్షలతో నిర్మిస్తున్న కొండమంజులూరు కమ్యూనిటీ హాలు, 20 లక్షలతో నిర్మిస్తున్న పంగలూరు బీసీ యాదవ కాలనీ కమ్యూనిటీ హాలు, 20 లక్షలతో నిర్మిస్తున్న తక్కెళ్లపాడు ఎస్సీ కమ్యూనిటీ హాలు, 30 లక్షలతో నిర్మిస్తున్న బూధవాడ ఎస్సీ కమ్యూనిటీ హాలు,50 లక్షలతో నిర్మిస్తున్న అలవలపాడు ముస్లిం కమ్యూనిటీ హాలు నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. సంతమాగులూరు మండలంలో 9.5 లక్షలతో నిర్మిస్తున్న ఏల్చూరు కమ్యూనిటీ హాలు, 50 లక్షలతో నిర్మిస్తున్న కొమ్మాలపాడు కాపు కమ్యూనిటీ హాలు, 30 లక్షలతో నిర్మిస్తున్న కామేపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాలు, 50 లక్షలతో నిర్మిస్తున్న కుందుర్రు బీసీ కమ్యూనిటీ హాలు, 30 లక్షలతో నిర్మిస్తున్న పరిటాలవారి పాలెం బీసీ కమ్యూనిటీ హాలుతో పాటు బల్లి కురవ మండంలో 50 లక్షలతో నిర్మిస్తున్న వైదన ముస్లిం కమ్యూనిటీ హాలు, 30 లక్షలతో నిర్మిస్తున్న కొమ్మినేని వారి పాలెం ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కొరిశపాడు మండలంలో 20 లక్షలతో నిర్మాణం చేపట్టిన రావినూతల ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాలు, 30 లక్షలతో నిర్మిస్తున్న ప్రాసంగులపాడు ఎస్సీ కమ్యూనిటీ హాలు,25 లక్షలతో నిర్మాణం చేపట్టిన ఎస్టీ కమ్యూనిటీ హాళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.

**యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు**

ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లి యువతకు బంగారు భవిష్యత్తును ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలుపెరుగని పోరాటం చేస్తున్నారని ఈ సందర్భంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ధీటుగా ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఎంతో మంది ఒప్పందాలు చేసుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రాబోతున్నాయని మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ యువత ఇకపై ఉద్యోగాల కోసం తమిళనాడు, కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్ లోనే ఉద్యోగాలు లభిస్తాయని ఆయన చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేసిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. భర్తలు చనిపోయిన వారి భార్యల వితంతు పెన్షన్లను కూడా నిలిపి వేసి అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకేసారి లక్షన్నర మంది వితంతువులకు పెన్షన్లు అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా దాదాపు రూ.33 వేల కోట్లను పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్న రాష్ట్రం, దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. అర్హులైన అందరికీ పెన్షన్లు అందజేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు టి.కొప్పెరపాడులో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఇప్పటికే 4.50 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఆరు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పిన ఆయన, అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. అదే విధంగా రెండు గుళ్లకు కూడా దూప, దీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మోటుపల్లి నుంచి కుంద వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిలో కలిపేందుకు కేంద్రానికి విజ్ఞప్తి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు అందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం బల్లికురవ మండల పరిధిలోని ముక్తేశ్వరం మేజర్ కాలువ పూడిక తీత పనులను మంత్రి పరిశీలించారు. చివరి ఎకరానికి కూడా సజావుగా నీరు పారేలా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**టీ కొట్టు వద్దే సమస్యల పరిష్కారం**

జే.పంగలూరు మండలం రామకూరు వద్ద ప్రజలతో కలసి టీ తాగిన మంత్రి గొట్టిపాటి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తీసుకొచ్చిన గ్రీవెన్స్ కు సంబంధించి వెంటనే పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. రామకూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన మహ్మద్ వలి కుటుంబ సభ్యులను కలిసి తన సానుభూతి తెలిపారు.





ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడిన అదే గ్రామానికి చెందిన దొడ్డక శ్రీను కుమారుడు చిన్నారి అభిరామ్ ను పరామర్శించారు. అదే విధంగా కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న మస్తాన్ రావుకు మంత్రి గొట్టిపాటి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు సంతమాగులూరు ఏఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, మండల టిడిపి అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి, ఉపాధ్యక్షులు చల్ల కోటేశ్వరరావు, కార్యదర్శి అనంతవరపు దేవదానం (దేవా ) మాజీ జెడ్పిటిసి చింత రామారావు అట్లా పెద్ద వెంకటరెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నిబోయిన గురుబ్రహ్మం మాజీ ఎంపీపీ సన్నిభైన ఏడుకొండలు తదితరులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు


# తెలంగాణలోనూ పెట్టుబడులకు దారులు.. ముహూర్తం పెట్టారు!



**హైదరాబాద్ పెన్ పవర్:** పెట్టుబడుల సాధనలో ఏపీ ప్రభుత్వం దూసుకుపోతోంది. ఇంటా-బయటా కూడా పెట్టుబడులు దూసుకు వస్తోంది. దేశ, విదేశాల్లో తిరిగి పెట్టుబడులు తీసుకురావడంతోపాటు.. విశాఖలో తాజాగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సు ద్వారా కూడా చంద్రబాబు తన కలను సాకారం చేస్తున్నారు. ఇదిలా వుంటే.. పెట్టుబడుల విషయంలో ఏపీతో పోటీ పడుతూ.. తెలంగాణ సర్కారు కూడా ఈ దిశగా పరుగులు పెడుతోంది. దీనికి సంబంధించి తాజాగా హైదరాబాద్ వేదికగా గ్లోబల్ సదస్సుకు శ్రీకారం చుట్టింది.వచ్చే నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ప్రధాన ఉద్దేశం పెట్టుబడులను ఆహ్వానించడం.. ఆకర్షించడమే. దీనిని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకు న్నారు. ఇటీవల ఆయన ఢిల్లీలో పర్యటించి పెట్టుబడులకు సానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారు అనేక మందిని కూడా ఆహ్వానించారు. అయితే.. విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు స్థాయిలో కాకున్నా.. దాదాపు అదే రేంజ్‌లో అయితే నిర్వహించాలని నిర్ణయించారు.

1300 మంది విదేశీ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను ఈ సదస్సుకు ఆహ్వానించారు. హైదరాబాద్ శివారులోని ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో నిర్వహించే ఈ సదస్సుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా 50 నుంచి లక్ష కోట్ల రూపాయల వరకు పెట్టుబడులను ఆహ్వానించాలన్నది ఈ సదస్సు కీలక లక్ష్యంగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఈ సదస్సు ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కూడా పెద్ద పీట వేయనున్నారు.'తెలంగాణ విజన్ డాక్యుమెంట్'ను ఈ వేదికగానే ఆవిష్కరించనున్నారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక స్థాయికి చేర్చాలన్న లక్ష్యాన్ని ఇప్పటికే ప్రతిపాదిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి దానిని సాకారం చేసుకునేందుకు పెట్టుబడులను గమ్యస్థానంగా ఎంచుకున్నారు. రెండు రోజుల సమ్మిట్‌లో సుమారు 70కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మరి ఏమేరకు సీఎం ఆశలు నెరవేరుతాయో చూడాలి.

# తమిళనాడుకు షాక్ ఇచ్చిన చంద్రబాబు.. అసలు ఏం జరిగిందో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** పెట్టుబడుల ఆకర్షణ, కొత్త పరిశ్రమల ఏర్పాటులో పొరుగు రాష్ట్రాలతో కూటమి ప్రభుత్వం పోటీపడుతోంది. ఐటీ అనుబంధ రంగ పరిశ్రమలను కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి విశాఖకు తన్నుకుపోయేలా మంత్రి లోకేశ్ పావులు కదుపుతున్నారు. అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదేవిధమైన చర్యలతో మరో పొరుగు రాష్ట్రం తమిళనాడుకు ఝలక్ ఇచ్చారు. చంద్రబాబు చాకచక్యంతో పావులు కదిపి సౌత్ కొరియాకు చెందిన ప్రముఖ షూ తయారీ సంస్థ హ్వాసెంగ్ ను తన సొంత నియోజకవర్గం కుప్పం తీసుకువచ్చారు. సౌత్ కొరియా సంస్థ హ్వాసెంగ్ నాన్ - లెదర్ షూలు తయారు చేస్తుంది. గ్లోబెల్ బ్రాండ్లు అయిన %చీఱనెవ,  ూసఱఋఎం% షూలను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఏడాదికి దాదాపు 20 మిలియన్ షూల తయారీ సామర్థ్యం ఉన్న ప్లాంట్ ను మన దేశంలో ఏర్పాటు చేయాలని భావించిన హ్వాసెంగ్ సంస్థ యాజమాన్యం ముందు తమిళనాడు ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఆగస్టు నెలలో దీనికి సంబంధించిన ఎంవోయూ కూడా కుదుర్చుకుంది. అయితే ఇటీవల కాలంలో కొత్త పరిశ్రమలకు అనుమతులు, ప్రోత్సాహకాలు ఇవ్వడంలో దూకుడు మీదున్న కూటమి ప్రభుత్వం హ్వాసెంగ్ సంస్థను ఏపీకి తీసుకువచ్చేలా పావులు కదిపి సక్సెస్ అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తమిళనాడులో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న తన నిర్ణయాన్ని హ్వాసెంగ్ మార్చుకుంది. తమిళనాడుకు సమీపంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో ప్లాంట్ స్థాపనకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంది. సుమారు 13 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో 20 వేల మందికి ఉపాధి కల్పించే హ్వాసెంగ్ కంపెనీ కుప్పం రావడంపై స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. చెన్నై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల కుప్పంలో ప్లాంట్ ఏర్పాటు తమిళనాడు కన్నా బెటర్ అన్న ఆలోచనతో హ్వాసెంగ్ తమ నిర్ణయం మార్చుకున్నట్లు చెబుతున్నారు.హ్వాసెంగ్ కంపెనీ నిర్మాణానికి కుప్పం నియోజకవర్గంలో రెండు గ్రామాల పరిధిలో వంద ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించేందుకు ముందుకొచ్చింది. పరిశ్రమ ఏర్పాటుకు తమిళనాడు, ఏపీ ఒకేలాంటి ప్రోత్సాహకాలు ప్రకటించినా, ఏపీ ఒక అడుగు ముందుకేసి రూపాయికే ఎకరా భూమి కేటాయించడంతో హ్వాసెంగ్ ఇటు మళ్లినట్లు చెబుతున్నారు. నిర్ణీత సమయంలోగా ప్లాంట్ నిర్మించి, ఉత్పత్తి ప్రారంభించాలన్న నిబంధనతో హ్వాసెంగ్ కు రూపాయికే భూమి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అంటున్నారు.

# మోదీ-చంద్రబాబు మధ్య సంబంధాలు.. సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని మోదీతో సంబంధాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికరంగా స్పందించారు. ప్రముఖ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని మోదీతో గతంలో ఉన్న ఘర్షణలపై చంద్రబాబు ప్రశ్నలు ఎదుర్కొన్నారు. అయితే ఈ విషయంలో సీఎం ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్య విభేదాలు రావాలని కోరుకుంటున్న వారి రాజకీయ ప్రత్యర్థులకు ఇది సరైన సమాధానంగా వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబు వ్యాఖ్యలతో భవిష్యత్తులో ఇలాంటి ప్రశ్నలు మళ్లీ ఎదురయ్యే అవకాశం రాదని అంటున్నారు.2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు విభేదించిన విషయం తెలిసిందే. మళ్లీ 2024 ఎన్నికల ముందు ఈ ఇద్దరు జట్టుకట్టి రికార్డు విజయాన్ని సాధించారు. కేంద్రంలో ప్రధాని మోదీ 3.0 ప్రభుత్వానికి బలమైన మద్దతుదారుగా ముఖ్యమంత్రి చంద్రబాబు అవతరించారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న 16 మంది ఎంపీల బలంపై కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆధారపడి వుంది. దీంతో మోదీపై ఒత్తిడి తెచ్చేలా చంద్రబాబు వ్యవహరిస్తారని జాతీయ స్థాయిలో అంతా ఊహించారు. కానీ, గత 18 నెలలుగా చంద్రబాబు తీరులో అలాంటి పద్ధతి కనిపించడం లేదు. ప్రధాని మోదీతో చాలా స్నేహపూర్వకంగా నడుచుకోడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారు.ఈ నేపథ్యంలో తాజాగా నేషనల్ మీడియా చానల్ కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని మోదీతో గతంలో కొనసాగిన ఘర్షణలపై క్లిష్టమైన ప్రశ్నను ఎదుర్కొన్నారు చంద్రబాబు. అయితే రాజకీయాల్లో తలపండిన ముఖ్యమంత్రి ఆ ప్రశ్నకు చాలా సింపుల్ గా సమాధానం చెప్పి తన చాణఖ్యాన్ని ప్రదర్శించారు. "మా మధ్య సంబంధాలు చాలా బాగున్నాయి. ఆంధ్రప్రదేశ్ కే కాదు.. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వం దేశానికే చాలా అవసరం" అంటూ చంద్రబాబు వెల్లడించారు. తమ మధ్య వ్యక్తిగతమైన వివాదాలు ఏవీ లేవని, తాను ఏ విషయమై ప్రశ్నించినా అది రాష్ట్రం కోసమేనంటూ చంద్రబాబు వివరణ ఇచ్చారు. తమ మధ్య సంబంధాలు ఇలానే కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలతో చాలా మందికి ఉన్న అనుమానాలు తొలగిపోయాయని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు తీవ్రంగా విభేదించారు. 2014లో టీడీపీ-బీజేపీ పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో గెలిచాయి. అయితే అప్పట్లో జాతీయ స్థాయిలో బీజేపీకి సొంతంగా బలం ఉండటంతో ఏపీకి నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం వహించిందని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతోపాటు రాజధాని అమరావతికి ప్రత్యేక నిధులు ఇవ్వలేదని చంద్రబాబు అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో విభేదించారు.

దీంతో 2019లో టీడీపీ-బీజేపీ విడివిడిగా పోటీ చేశాయి. ఆ తర్వాత పరిణామాలతో 2024 ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీలు మళ్లీ కలిశాయి. ఇప్పుడు చంద్రబాబు పార్టీకి ఉన్న ఎంపీల బలమే కేంద్ర ప్రభుత్వానికి కీలకంగా మారింది. అయినప్పటికీ ఆయన ప్రధాని మోదీతో సన్నిహితంగా మెలుగుతున్నారు. దీనివల్ల 2024 ఎన్నికల తర్వాత కేంద్రం వైఖరి మారిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజధాని అమరావతితోపాటు పలు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని అంటున్నారు.

# టీడీపీలో కొత్త రూల్స్.. ఎమ్మెల్యేలు ఎప్పుడు, ఏం చేయాలి? హైకమాండ్ టైంటేబుల్ ఇదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ఎమ్మెల్యేల పనితీరుపై విమర్శలు పెరిగిపోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల పార్టీ కార్యాలయానికి చంద్రబాబు వెళ్లిన సమయంలో అందిన ఫిర్యాదులు, కేబినెట్ మీటింగులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన విషయాలు, మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్ కు ఒకేరోజు 5 వేల ఫిర్యాదులు రావడాన్ని పరిగణనలోకి తీసుకున్న సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలకు తగిన దిశానిర్దేశం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం తరపున తాను, మంత్రులు ఎంతలా కష్టపడినా ఎమ్మెల్యేలు, ప్రజలకు మధ్య గ్యాప్ ఉంటే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని భావించిన సీఎం.. ఎమ్మెల్యేల నిర్లక్ష్య ధోరణిని సరిదిద్దాలని డిసైడ్ అయ్యారని అంటున్నారు. దీంతో ఎమ్మెల్యేలు ఎప్పుడు ఏం చేయాలన్న అంశమై పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎమ్మెల్యేలు కేడర్, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వల్ల సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని సీఎం భావిస్తున్నారు. దీంతో ఇకపై ఎమ్మెల్యేలు నిరంతం ప్రజల మధ్య ఉండటమే కాకుండా, ప్రభుత్వ కార్యక్రమాల్లో వారు పూర్తిగా భాగస్వాములు అయ్యేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. కూటమికి చెందిన 164 మంది ఎమ్మెల్యేలు ఇకపై హైకమాండ్ చెప్పిన ప్రకారమే నడుచుకోవాల్సివుం టుందని సూచించారు. ఇప్పటికే మంత్రి లోకేశ్ సూచనల ప్రకారం ప్రతి శుక్రవారం నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు ప్రజాదర్బార్ నిర్వహించాల్సివుంటుంది. దీనికి అదనంగా ప్రత్యేక టైంటేబుల్ రూపొందించి, ఎమ్మెల్యేలు ఆ ప్రకారం నడుచుకోవాలని ఆదేశాలు వెళ్లాయి.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ల పంపిణీ, అన్నా క్యాంటీన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ వంటివాటి పట్ల ఎమ్మెల్యేలు ఆసక్తి చూపడం లేదని ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ కార్యాలయానికి వచ్చిన సమయంలో 48 మంది ఎమ్మెల్యేలు ఆయా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం లేదని సీఎం దృష్టికి వెళ్లింది. ఇలా ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటే అసలుకే ఎసరు వస్తుందని ఆగ్రహించిన సీఎం.. ఆయా ఎమ్మెల్యేల నుంచి వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని సూచించారు. అదే సమయంలో భవిష్యత్తులో ఈ పద్ధతి కొనసాగకూడదని పార్టీ యంత్రాంగానికి స్పష్టం చేశారు.దీంతో ఎమ్మెల్యేలు ఎప్పుడు ఏం చేయాలనే అంశమై పార్టీ స్పష్టమైన సూచనలతో టైంటేబుల్ తయారు చేశారు. ఈ ప్రకారం ఎమ్మెల్యేలు అందరూ ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో విధిగా పాల్గొనాల్సివుంటుంది. అదేవిధంగా పార్టీ యంత్రాంగం మొత్తం ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచనలు వెళ్లాయి. ఆ తర్వాత 5వ తేదీన ప్రతి శాసనసభ్యుడు విధిగా నియోజకవర్గం పరిధిలో పాఠశాలను సందర్శించాల్సివుంటుంది. అక్కడ విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, వసతి, బోధనాంశాలపై తెలుసుకోవాలి. ఆ తర్వాత 10వతేదీన అన్నా క్యాంటిన్లను తనిఖీ చేయాలి. అన్నా క్యాంటిన్లలో పేదలకు అందుతున్న భోజనం, శుభ్రత, సిబ్బంది ప్రవర్తనపై తెలుసుకోవాల్సివుంటుందని పార్టీ కార్యాలయం నుంచి సమాచారం పంపారు. ఇక 15వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేయాలి. 20న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయాలి. 25న మండల స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలి. ప్రజల సమస్యలు, ఉద్యోగుల పనితీరుపై ఆరా తీయాల్సివుంటుంది. ఇదే సమయంలో నెలలో ఏదేనా రోజు ఒక గ్రామాన్ని సందర్శించి ఇంటింటికీ తిరగాలి. అదేవిధంగా పల్లె నిద్ర చేయాల్సివుంటుంది. ఇలా ప్రతి ఎమ్మెల్యే పార్టీ ఆదేశాలను పాటిస్తుందీ లేనిదీ కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. నిర్దేశిత సమయంలో నిర్ణయించిన కార్యక్రమం చేసిందీ? లేనిదీ కూడా కేంద్ర కార్యాలయానికి తెలియజేయాల్సి వుంటుంది. దీనిద్వారా ప్రజలతో ఎమ్మెల్యేలు నిరంతరం టచ్ లో ఉండేలా సీఎం చంద్రబాబు చూస్తున్నారని అంటున్నారు. ఫలితంగా ఎమ్మెల్యేల పనితీరులో మార్పులు వస్తాయని ఆశిస్తున్నారు.

# ప్లాన్ మార్చిన పవన్.. పిఠాపురంలో ఏం చేస్తున్నారంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ ఫ్యూచర్ పొలిటికల్ ప్లాన్ పై విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కాకినాడ జిల్లా పిఠాపురం శాసనసభ్యుడిగా ఉన్న పవన్.. తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతోపాటు జనసేన పార్టీకి బలమైన పునాదులు వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం గోదావరి జిల్లాలను తన రాజకీయ క్షేత్రానికి కేంద్రంగా మార్చుకునేలా అడుగులు వేస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇటీవల పవన్ తీసుకున్న నిర్ణయాలను గమనిస్తే.. ఆ ఫ్యూచర్ ప్లాన్ మారిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గత ఎన్నికల్లో పిఠాపురం నుంచి గెలిచిన పవన్ ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుంటానని ప్రకటించారు. అయితే గెలిచి ఏడాదిన్నర అవుతున్నా, పవన్ పిఠాపురం చుట్టపు చూపుగానే వస్తున్నారని చెబుతున్నారు. పిఠాపురంలో ఇప్పటికీ ఆయన సొంత ఇల్లు నిర్మాణం పూర్తికాలేదు. గెలిచిన వెంటనే పిఠాపురంలో పవన్ సుమారు 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇందులో తన ఇల్లుతోపాటు పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పవన్ పిఠాపురం అప్పుడప్పుడు వచ్చి వెళ్లిపోతున్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ ఎక్కువగా రాజధాని అమరావతి నుంచి హైదరాబాద్ కు రాకపోకలు సాగిస్తున్నారు. వారంలో ఒక రోజు హైదరాబాద్ వెళుతున్న పవన్.. ఇకపై పిఠాపురం నియోజకవర్గానికి సమయం కేటాయించాలని చూస్తున్నారని అంటున్నారు.పిఠాపురంలో పవన్ కొన్న భూమికి అనుకునే మరో 3 ఎకరాల భూమిని సైతం పవన్ కొనుగోలు చేయనున్నారని చర్చ జరుగుతోంది. ఇకపై తన రాజకీయానికి పిఠాపురమే కేంద్రం చేసుకోవాలని భావిస్తున్న పవన్.. కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా ఇక్కడ పార్టీ కార్యాలయంతోపాటు తనను కలిసేందుకు వచ్చే కార్యకర్తలకు మౌలిక వసతులు కూడా ఉండేలా వసతి గదులు నిర్మించాలని భావిస్తున్నారని చెబుతున్నారు. రానున్న రోజుల్లో పిఠాపురం, మంగళగిరిలో ఎక్కువ సమయం గడపాలన్న ఆలోచనతో ఉన్న పవన్... పిఠాపురంలో ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక గదులు, వారి వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారని అంటున్నారు. ఇలా పిఠాపురంలో అన్నిరకాలుగా కార్యాలయంతోపాటు కార్యకర్తల విడిది భవనాల నిర్మాణానికి పవన్ ప్రయత్నించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని అంటున్నారు. గోదావరి జిల్లాల్లో జనసేనకు బలమైన సామాజికవర్గం మద్దతు ఉంది. ఈ బలం చెక్కుచెదరకుండా ఉండాలంటే ఆ వర్గం వారికి దగ్గరగా ఉండాలే సూచనలు వస్తున్నాయి. ఈ విషయంపై పవన్ కూడా ఏకీభవిస్తున్నారని అంటున్నారు. ఏ రకంగా చూసిన గోదావరి జిల్లాల్లో జనసేన బలంగా ఉంటేనే కూటమి ప్రభుత్వం రెండు మూడు టర్ములు కొనసాగే పరిస్థితి ఉందని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం గోదావరి జిల్లాల్లో ఉన్న 32 నియోజకవర్గాల్లో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దీంతో పిఠాపురాన్ని తన రాజకీయ క్షేత్రానికి కేంద్రబిందువు చేసేలా పవన్ అడుగులు వేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.


# తొలి టెస్టులో ఘోర పరాజయం... డబ్ల్యూటీసీ పట్టికలో టీమిండియా డౌన్

- ఈడెన్ గార్డెన్స్ టెస్టులో భారత్‌పై దక్షిణాఫ్రికా ఘనవిజయం
- 30 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సఫారీల టెస్టు గెలుపు
- డబ్ల్యూటీసీ పట్టికలో రెండో స్థానానికి ఎగబాకిన దక్షిణాఫ్రికా
- నాలుగో స్థానానికి పడిపోయిన భారత్
- కెప్టెన్ బవుమా, స్పిన్నర్ హార్మర్ సఫారీ విజయంలో కీలకం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 సైకిల్‌లో టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్‌పై 30 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించిన సఫారీ జట్టు, పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా ఖాతాలో 24 పాయింట్లు చేరగా, వారి పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (%ూజు%) 66.67కి పెరిగింది. మరోవైపు ఈ ఓటమితో టీమిండియా నాలుగో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం భారత పీసీటీ 54.17గా ఉంది. ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా, శ్రీలంక మూడో స్థానానికి పరిమితమైంది. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై జరిగిన ఈ ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన చేసింది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అంతేకాకుండా, భారత గడ్డపై 2010 తర్వాత సఫారీలకు ఇదే తొలి టెస్టు విజయం కావడం గమనార్హం. 124 పరుగుల స్వల్ప లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, సఫారీ స్పిన్నర్ల ధాటికి 93 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/21) మరోసారి తన మాయాజాలంతో భారత బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టగా, కేశవ్ మహారాజ్ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టాడు. లెఫ్టార్మ్ సీమర్ మార్కో యన్సెన్ ఓపెనర్లను పెవిలియన్ చేర్చడంతో భారత్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. మెడ గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు దూరమవడం కూడా జట్టుపై ప్రభావం చూపింది. వాషింగ్టన్ సుందర్ (31), అక్షర్ పటేల్ (26) కాసేపు పోరాడినప్పటికీ, కీలక సమయంలో సుందర్‌ను మార్క్రమ్, అక్షర్‌ను కేశవ్ మహారాజ్ ఔట్ చేయడంతో భారత ఓటమి ఖాయమైంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా క్యాంప్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. అంతకుముందు, రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో క్రీజులో పాతుకుపోయి అజేయంగా 55 పరుగులు చేశాడు. 91 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఆదుకున్నాడు. కార్బిన్ బాష్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు కీలకమైన 44 పరుగులు జోడించి, జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ఈ భాగస్వామ్యమే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లోనూ 4 వికెట్లు తీసిన సైమన్ హార్మర్, మొత్తంగా 8 వికెట్లతో దక్షిణాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఏడాది ఆరంభంలో లార్డ్స్‌లో ఆస్ట్రేలియాను ఓడించి డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచిన దక్షిణాఫ్రికా, ఇప్పుడు భారత గడ్డపై అవే ఫామ్‌ను కొనసాగించడం వారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు శనివారం నుంచి గువహటిలోని ఏసీఏ స్టేడియంలో ప్రారంభం కానుంది.

# సరిగ్గా ఆడకపోతే ఇలాంటి ఫలితాలే వస్తాయి: గంభీర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు ఓటమిపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఓటమికి పిచ్‌ను కారణంగా చూపడాన్ని పూర్తిగా తోసిపుచ్చాడు. అసలు తప్పు పిచ్‌ది కాదని, భారత బ్యాటర్ల వైఫల్యమే ఓటమి కారణం అని స్పష్టం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గంభీర్ మాట్లాడుతూ, జట్టు ఓటమిపై అసంతృప్తిని వ్యక్తం చేశాడు. తాము ఎలాంటి పిచ్ కావాలని కోరామో, క్యురేటర్ సరిగ్గా అలాంటి పిచ్‌నే తయారు చేశాడని, అందుకు తాము సంతోషంగా ఉన్నామని తెలిపాడు."మేం అడిగిన పిచ్ ఇదే. మాకు లభించిన వికెట్‌తో మేం సంతృప్తిగా ఉన్నాం. క్యురేటర్ మాకు చాలా సహాయం చేశాడు. ఇలాంటి పిచ్‌పై సరిగ్గా ఆడకపోతే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఇది ఆటకు పనికిరాని వికెట్ ఏమీ కాదు. ఆటగాళ్ల టెక్నిక్, టెంపర్మెంట్‌ను పరీక్షించే వికెట్ ఇది. పటిష్టమైన డిఫెన్స్ ఉంటే ఇలాంటి పిచ్‌లపై కూడా పరుగులు సాధించవచ్చు" అని గంభీర్ విశ్లేషించాడు. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు."నా అభిప్రాయం ప్రకారం 123 పరుగులు సులభంగా ఛేదించాల్సిన లక్ష్యమే. పరుగులు చేయాలంటే సరైన మానసిక దృక్పథం ఉండాలి. సరిగ్గా ఆడనప్పుడు ఇలాంటి పరాజయాలు తప్పవు. ఈ పిచ్ లో ఎలాంటి దెయ్యాలు లేవు. అక్షర్ పటేల్, టెంబా బవుమా పరుగులు చేశారు కదా? అలాంటప్పుడు మన జట్టులోని మిగతా బ్యాటర్లు ఎందుకు విఫలమయ్యారు?" అని గంభీర్ ప్రశ్నించాడు. ఈ ఓటమికి ప్రధాన కారణం బ్యాటర్లలో మానసిక స్థైర్యం లోపించడమేనని తేల్చిచెప్పాడు. ఈ వికెట్‌పై ఎక్కువగా సీమర్లే వికెట్లు పడగొట్టారని గుర్తుచేశారు. ఇది కేవలం స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్ కాదని, ఆటగాళ్ల మానసిక దృఢత్వాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని, నిలకడను సవాలు చేసే వికెట్ అని పేర్కొన్నాడు. కేఎల్ రాహుల్, టెంబా బవుమా, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు పటిష్టమైన డిఫెన్స్‌తో ఆడారని, మిగతావారు ఆ స్ఫూర్తిని ప్రదర్శించలేకపోయారని గంభీర్ చురకలంటించాడు. అంతిమంగా, పిచ్‌పై నిందలు వేయకుండా, బ్యాటింగ్ వైఫల్యాలను అంగీకరించి, వాటిని సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు.

# సౌతాఫ్రికాకు గోల్డెన్ లెగ్‌గా బవుమా.. 11 టెస్టుల్లో ఓటమి లేకుండా జైత్రయాత్ర




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాను సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తూనే ఉంటారు. అతను ఆటకు పనికిరాడని.. కెప్టెన్సీ అనవసరంగా ఇచ్చారని నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఒకవేళ అతను ఆడకపోతే ట్రోల్స్, మీమ్స్ చేయడానికి రెడీగా ఉంటారు. 2023 వన్డే వరల్డ్ కప్ లో బవుమా చెత్త బ్యాటింగ్ తీరుపై చాలా విమర్శలు వచ్చాయి. అయితే వీటన్నిటికీ బవుమా చెక్ పెట్టి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ను సౌతాఫ్రికాకు అందించాడు. 27 ఏళ్ళసఫారీ జట్టు ఐసీసీ టైటిల్ కరువు తీర్చిన బావుమా.. ఇండియాలో 15 ఏళ్ళ సౌతాఫ్రికాపై టెస్ట్ విజయాన్ని అందించాడు. ఈ క్రమంలో బవుమా టెస్టుల్లో తన విజయాల పరంపరను కొనసాగిస్తున్నాడు. కోల్‌కతా వేదికగా ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన తొలి టెస్టులో టీమిండియాపై విజయంతో టెస్టుల్లో సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఓటమి లేని కెప్టెన్ గా తన రికార్డ్ కొనసాగిస్తున్నాడు. ఇప్పటివరకు ఓవరాల్ గా 11 టెస్టుల్లో కెప్టెన్సీ చేసిన ఈ సఫారీ కెప్టెన్ 10 విజయాలు.. ఒక డ్రా తో 90 శాతం పైగా విజయాలను సాధించాడు. క్రికెట్‌లో ఓటమి లేకుండా కెప్టెన్‌గా అత్యధిక విజయాలు సాధించిన అరుదైన రికార్డు బవుమా ఖాతాలోనే ఉంది. బవుమా తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ వార్విక్ ఆర్మ్‌స్ట్రాంగ్ రెండో స్థానంలో ఉన్నాడు. 1902–1921 మధ్య కాలంలో ఆర్మ్‌స్ట్రాంగ్ 10 టెస్ట్ మ్యాచ్ ల్లో కెప్టెన్ గా చేసి 8 విజయాలు, 2 డ్రాలతో బవుమా తర్వాత స్థానంలో ఉన్నాడు. టెస్ట్ ఛాంపియన్ షిప్ గెలవడంతో వార్విక్ ఆర్మ్‌స్ట్రాంగ్ రికార్డును బవుమా బ్రేక్ చేసి అగ్ర స్థానంలోకి దూసుకెళ్ళగా.. టీమిండియాపై విజయంపై తన రికార్డును మరింత పదిలం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ లో తన కెప్టెన్సీతో పాటు బవుమా బ్యాటింగ్ లోనూ అదరగొట్టాడు. రెండో ఇన్నింగ్స్ లో 55 పరుగులు చేసి సౌతాఫ్రికాకు విలువైన పరుగులను అందించాడు. బౌలింగ్ కు అనుకూలిస్తున్న పిచ్ పై తన దుర్భేధ్యమైన డిఫెన్స్ తో ఎంతో ఓపిగ్గా బ్యాటింగ్ చేశాడు. మ్యాచ్ మొత్తంలో బవుమాదే ఏకైక హాఫ్ సెంచరీ కావడం విశేషం. కోల్?కతా వేదికగా ఈడెన్ గార్డెన్స్ లో ముగిసిన ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. సఫారీ బౌలర్ల ధాటికి 124 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేయలేక 93 పరుగులకే ఆలౌట్ అయింది. వాషింగ్ టన్ సుందర్ (31), అక్షర్ పటేల్ (26) పోరాటం జట్టు విజయానికి సరిపోలేదు. సౌతాఫ్రికా బౌలర్లలో హార్మర్ నాలుగు వికెట్లు పడగొట్టి విజయంలో కీలక పాత్ర పోషించాడు. జాన్సెన్, మహరాజ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. హార్మర్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# 2025 లో డార్లింగ్ అలా సరిపెట్టాడు!

క్లాసిక్ బ్లాక్ చీరలో నువేక్ష స్టన్స్





మూడేళ్లగా డార్లింగ్ ప్రభాస్ నుంచి క్రమం తప్పకుండా హీరోగా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. 2022 లో –రాధేశ్యామ్ – 2023 లో –ఆదిపురుష్ –%సలార్ సీజ్ ఫైర్ – లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించారు. గత ఏడాది – కల్కి 2898 – తో ప్రేక్షకుల్ని ఏకంగా ఓ కొత్త లోకంలోకే తీసుకెళ్లారు. మరి 2025 సంగతేంటి? మరికొన్ని రోజుల్లో కొత్త ఏడాదికిలోకి అడుగు పెట్టబోతున్నాం? అలాంటి సమయంలో 2025 లో ఎలాంటి చిత్రాలతో డార్లింగ్ అలరించారు? ంఅంటే పెద్దగా హడావుడి లేకుండా సైలెంట్ గానే 2025ని ముగిస్తున్నట్లు కనిపిస్తోంది.

**మూడు సినిమాలతో అలా:**
ఈ ఏడాది ప్రభాస్ గెస్ట్ పాత్రలకే పరిమితమయ్యారు. మంచు విష్ణు హీరోగా నటించిన %–%కన్నప్ప%–% లో ప్రభాస్ రుద్ర పాత్రలో కనిపించారు. కానీ ఆ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. కామియో పరంగా ప్రభాస్ కి ఈ సినిమా కలిసి రాలేదు. ఇటీవలే రిలీజ్ అయిన %–%మిరాయ్%–% లో మాత్రం వాయిస్ ఓవర్ ఇచ్చారు. తేజ సజ్జా హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రభాస్ వాయిస్ ఓవర్ కూడా సినిమాకు కలిసొచ్చింది. తాజాగా %–%బాహుబలి ది ఎపిక్%–% తోనూ డార్లింగ్ థియేటర్లోకి వచ్చాడు.

**రిలీజ్ అవ్వాల్సిన సినిమా వాయిదా:**
బాహుబలి – రెండు భాగాలను కలిపి ఒకే భాగంగా ఈ చిత్రం రిలీజ్ అవ్వడంతో డార్లింగ్ అభిమానులకు కొంతవరకు ఉపశమనం దొరికింది. సోలో రిలీజ్ లు లేని సమయంలో %–%బాహుబలి%–% రిలీజ్ అన్నది అభిమానులకు కాస్త దగ్గర చేసింది. అంతకు మించి 2025 లో డార్లింగ్ అభిమానులకు కొత్త సినిమా ట్రీట్ ఇచ్చిందంటూ ఏదీ లేదు. %–%ది రాజాసాబ్%–% మాత్రం ఇదే డాది రిలీజ్ చేయాలని చాలా ప్రయత్నాలు చేసారు కానీ సాధ్యపడలేదు. చిత్రీకరణ పూర్తయిన పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా రిలీజ్ అవ్వలేదు. అలాగే %–%పౌజీ%–% కూడా భారీ సినిమా కావడంతో? రిలీజ్ ఉండదని ముందు నుంచి క్లారిటీ ఉండనే ఉంది. అయితే 2026 లో మాత్రం అన్ని లెక్కలు సరి చేస్తాడు.

**లైన్ లో భారీ ప్రాజెక్ట్ లు:**
బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ లతో అలరించడం లాంఛనమే. జనవరి లో %–%రాజాసాబ్%–% రిలీజ్ అవుతుంది. అటుపై ఆరు నెలల గ్యాప్ లోనే %–%పౌజీ%–% కూడా రిలీజ్ అవుతంది. ఆగస్టు లో ఆ సినిమా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. అదే ఏడాది ఆరంభంలో భారీ అంచనాల మధ్య %–%స్పిరిట్%–% కూడా మొదలవుతుంది. ఈ సినిమా రిలీజ్ కు మాత్రం సమయం పడుతుంది. కుదిరితే %–%కల్కి 2%–, –%సలార్ 2%–% ని కూడా ఇదే ఏడాది ప్రారంభిస్తారు. ఈ రెండు సినిమాల రిలీజ్ కు మాత్రం సమయం ఎక్కువగానే పడుతుంది.

రుక్మిణి ఫ్యాషన్ అలలను చూడండి



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965